

మూడేళ్ల లాసెట్‌లో భార్గవికి ఫస్ట్ ర్యాంకు



భార్గవి

కొత్తూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య (బి.ఎల్.) మూడేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన లాసెట్‌లో అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ శారదానగర్‌కు చెందిన వేముల వెంకటశివసాయి భార్గవి మొదటి ర్యాంకు సాధించింది. ఆమె 120కు గాను 115 మార్కులు తెచ్చుకుంది. భార్గవి ఇప్పటికే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇనుస్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేసింది. తల్లిదండ్రులు నరసింగరావు (ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి), సుబ్బలక్ష్మి (గృహిణి).

విశాఖకు 60 వేల మంది

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా నుంచి తరలింపు

- 30 వేల మంది విద్యార్థులు, 25 వేల మంది ఫార్మా ఉద్యోగులు, కార్మికులు
- విద్యార్థులు, సాధారణ ప్రజల కోసం 825 ప్రత్యేక బస్సులు
- నేటి సాయంత్రానికి ఎంపిక చేసిన కేంద్రాలకు తరలింపు



ఎస్పీ తుహిన్ సిన్హా



యోగా దినోత్సవానికి వెళ్లేందుకు కేటాయించిన చేసిన బస్సులో ట్రయల్ నిర్వహిస్తున్న డీఆర్ఓ సత్యనారాయణ, అధికారులు

- రాత్రికి ఇక్కడే బస, భోజనం
- శనివారం తెల్లవారుజామున విశాఖకు పయనం
- మండలాల వారీగా రూట్లు ఖరారు
- కార్యక్రమం పూర్తయిన తరువాత తిరిగి స్వస్థలాలకు చేరిక
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రజలు తరలి వెళ్లనున్నారు. వీరిని జిల్లాలో ఎంపిక చేసిన విడిది కేంద్రాలకు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక బస్సుల్లో చేరుస్తారు. రాత్రికి ఇక్కడే భోజనం, వసతి సదుపాయాలు కల్పించి, శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు బస్సుల్లో విశాఖ తీసుకెళతారు. అక్కడ యోగా దినోత్సవ వేడుకలు పూర్తయిన తరువాత తిరిగి బస్సుల్లో ఎక్కించి స్వస్థలాలకు చేరుస్తారు. ఈ మేరకు జిల్లా నుంచి సుమారు 60 వేల మందిని విశాఖకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా హాజరుకానున్న విషయం తెలిసిందే. యోగాంధ్ర-2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వ యంత్రాంగం.. రెండు వారాల క్రితమే ఏర్పాట్లు మొదలు పెట్టింది. విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో అనకాపల్లి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లా నుంచి విద్యార్థులు, ఫార్మా కంపెనీల ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రజలు కలిపి మొత్తం 60 వేల మంది యోగాంధ్ర వేడుకలకు హాజరు కానున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆరో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న 30,200 మంది విద్యార్థులు, ప్రతి మండలం నుంచి 200 మంది చొప్పున 4,800 మంది సాధారణ ప్రజలు, అచ్యుతాపురం, పరవాడ, నక్కపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లోని ఫార్మా కర్మాగారాల్లో పనిచేస్తున్న 25,000 మంది ఉద్యోగులు, కార్మికులు యోగాంధ్ర వేడుకకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా వర్గాల వారికి వేర్వేరుగా బస్సులు కేటాయించారు. మొత్తం 825 ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నారు. ప్రతి బస్సులో 40 నుంచి 50 మంది వెళ్లడానికి వీలుంటుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులను గురువారం సాయంత్రానికే జిల్లాకు రప్పించారు. ఫార్మా కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఆయా కంపెనీలకు చెందిన బస్సుల్లో విశాఖ వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ నియోజకవర్గం బస్సులు, ఏ మార్గంలో విశాఖలోని యోగా వేదికల వద్దకు చేరుకోవాలో రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. విద్యార్థులను తీసుకెళ్లే ప్రతి బస్సులో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా బాధ్యతలు అప్పగించారు. యోగాలో పాల్గొనే వారికి టీ షర్టులు, మ్యాట్‌లు అందించనున్నారు. యోగాకు వెళుతున్న ప్రతిఒక్కరి వివరాలను జియో

... మిగతా 6వ పేజీలో

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

- ఎస్పీ తుహిన్ సిన్హా

విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో జిల్లాలోని జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి పాయకరావుపేట మీదుగా విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలను శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి పాయకరావుపేట వద్ద నిలిపివేస్తారు. ఇతర వాహనాలు పాయకరావుపేట నుంచి అనకాపల్లి, సబ్బవరం, పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లాల్సి వుంటుంది. అనకాపల్లి జిల్లా నుంచి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వెపు రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు శుక్ర, శనివారాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఎస్పీ సూచించారు. జాతీయ రహదారిపై లారీలను, బ్రేక్ డౌన్ అయిన వాహనాలను నిలిపి ఉంచకూడదు. ట్రక్కులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలను పోలీసులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే రెండు రోజులపాటు పార్కింగ్ చేసుకోవాలి.

గిన్నిస్ రికార్డుపై గురి

బీచ్‌రోడ్డులో 3.6 లక్షల మందితో యోగా

- 29.8 కిలోమీటర్లు...326 కంపార్టుమెంట్లు
- పార్క్ హోటల్ వరకు కంపార్టుమెంట్‌కు వెయ్యి మంది.. ఆపై 672/1350 మంది
- ప్రతి కంపార్ట్‌మెంట్‌కు 30 మంది సేవకులు



బీచ్ రోడ్డులో ప్రధాన వేదిక

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 'యోగాంధ్ర' పేరుతో నగరంలో నిర్వహిస్తున్న కార్యక్రమంతో గిన్నిస్ రికార్డు నెలకొల్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయి. ఇందుకోసం ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ 29.8 కి.మీ. పొడవున పచ్చటి తివాచీలు పరిచి యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లుచేశారు. ఒక్క బీచ్‌రోడ్డులోనే మొత్తం 3.6 లక్షల మందితో యోగాసనాలు వేయించాలనేది లక్ష్యం. ఇందుకోసం 326 కంపార్టుమెంట్లు పెట్టారు. ఆర్‌కే బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకూ ప్రతి కంపార్టుమెంట్‌కు కేవలం వేయిమందినే అనుమతిస్తారు. వీటిలో తర్ఫీదు పొందినవారు మాత్రమే యోగాసనాలు వేస్తారు. ఆ తరువాత వుడా పార్క్ నుంచి భీమిలి వరకూ మిగిలిన కంపార్టుమెంట్లను రెండు సైజుల్లో తయారు చేశారు. ఒక దాంట్లో 672 మంది, మరో దాంట్లో 1,350 మంది పడతారు. ఎవరు ఏ కంపార్టుమెంట్‌లోకి వెళ్లాలనేది వార్డు, గ్రామ సచివాలయాలతో మ్యాపింగ్ చేశారు. సచివాలయాల సిబ్బందికి వారిని తీసుకువెళ్లే బాధ్యత అప్పగించారు.

ప్రతిచోట 30 మంది సేవకులు

ప్రతి కంపార్టుమెంట్‌కు గెజిటెడ్ అధికారిని ఇన్‌చార్జిగా వేశారు. ఒక యోగా ఇన్‌స్ట్రక్టర్, ముగ్గురు యోగా డిమాన్‌స్ట్రేటర్లు, పది మంది వలంటీర్లు, తాగునీటి సరఫరాకు ఒక ఇన్‌చార్జి, ఆహారం సరఫరాకు ఒకరు, పర్యవేక్షణకు ఇద్దరు సూపర్‌వైజర్లు, శానిటేషన్‌కు నలుగురు, రెండు టాయిలెట్లకు ఒకరు చొప్పున క్లీనర్, ఒక ఏఎన్ఎం, ఒక ఆశ వర్కర్, నలుగురు కలాసీలను కేటాయించారు. వీరంతా ఆ కంపార్టుమెంట్‌లో ఆసనాలు వేసే వారికి సేవలు అందిస్తారు.

ఏయూలో 26,395 మంది

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా 26,395 మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించే కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈ ప్రదర్శన ఉంటుంది. ఆ రోజున వర్షం పడితే బీచ్‌రోడ్డులో

... మిగతా 6వ పేజీలో

యోగా దినోత్సవంలో యుద్ధ విమానాల ప్రదర్శన

- వేదికపై ప్రధానితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, ఆయుష్ కేంద్ర మంత్రి
- నరేంద్రమోదీ ప్రసంగం 15 నిమిషాలు



విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణా బీచ్‌లో శనివారం నిర్వహించే యోగాంధ్రాలో తూర్పు నౌకాదళం వైమానిక ప్రదర్శన చేయనుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వేదిక వద్దకు చేరుకొని కార్యక్రమం ప్రారంభించే ముందు అంటే 6.31 గంటలకు విమానాల బృందం ఆకాశంలో 'ఫ్లై పాస్ట్' చేస్తుంది. ఆ తరువాత కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి జాదవ్ ప్రతాప్‌రావ్ గణపతిరావు నాలుగు నిమిషాలు ప్రసంగిస్తారు. ఆ తరువాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ రెండు నిమిషాలు, ఆపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు నిమిషాలు మాట్లాడతారు. చివరిగా ప్రధాని నరేంద్రమోదీ 15 నిమిషాలు ప్రసంగించి ఏడు గంటల కల్లా

... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ బడులు వెలవెల!

ప్రభుత్వం మారి ఏడాదైనా.. విద్యా శాఖను వీడని పాత వాసన

- ప్రాథమిక పాఠశాలల్లో అరకొరగా విద్యార్థులు
- కొత్త ప్రవేశాలకు శ్రద్ధ చూపని విద్యా శాఖ అధికారులు
- ఒకరిద్దరు విద్యార్థులతోనే నడుస్తున్న స్కూళ్లు



వెంకయ్యపాలెం పాఠశాలలో ఒకే విద్యార్థి

మాకవరపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది దాటినా.. విద్యా శాఖలో కొంతమంది అధికారుల తీరు మారలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మండల విద్యా శాఖ అధికారులు పెద్దగా శ్రద్ధ చూపలేదు. దీంతో గతంలో మాదిరిగానే పలు ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు, ఇద్దరు విద్యార్థులు మాత్రమే వున్నారు. విచిత్రం ఏమిటంటే.. ఒక పాఠశాలల్లో ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా లేనప్పటికీ ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ పాఠశాలకు ఒక ఎస్‌జీటీని బదిలీ చేశారు.

మండలంలోని వెంకయ్యపాలెం పాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా ఇద్దరు విద్యార్థులు, వీరికి పాఠాలు బోధించడానికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి ఒక ఉపాధ్యాయుడుని బదిలీ చేశారు. ఈ ఏడాది కూడా ఇక్కడ ఇద్దరు విద్యార్థులే వున్నారు. కొత్తగా ఒక్క విద్యార్థిని కూడా చేర్పించలేకపోయారు. సుభద్రయ్యపాలెం పాఠశాలలో గత విద్యా సంవత్సరం వరకు ఇద్దరు విద్యార్థులు వుండేవారు. వీరు ఐదో తరగతి పూర్తి చేసుకుని, ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేరారు. ఈ ఏడాది కొత్తగా ఎవరూ చేరలేదు. దీంతో ఒక్క విద్యార్థి కూడా లేరు. అయినప్పటికీ బదిలీల్లో భాగంగా ఈ పాఠశాలకు ఒక టీచర్‌ను నియమించారు. మల్లవరం ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది ముగ్గురు విద్యార్థులు వుండగా, ఈ ఏడాది ఇద్దరు మాత్రమే వున్నారు. బూరుగుపాలెం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, బుచ్చన్నపాలెం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, జడ్.గంగవరం

... మిగతా 6వ పేజీలో



బూరుగుపాలెం పాఠశాలలో ముచ్చటగా ముగ్గురు పిల్లలు..

పరవాడపాలెంలో గెడ్డ వాగు కబ్జా

విలువ రూ.2 కోట్లుపైనే..

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



పరవాడపాలెంలో గెడ్డవాగు స్థలాన్ని ఆక్రమించి మధ్యలో నుంచి వేసిన రోడ్డు

కశింకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరవాడపాలెం పంచాయతీలో కోట్లాది రూపాయల విలువ చేసే గెడ్డవాగు స్థలం కబ్జాకు గురవుతున్నది. స్థానిక సంస్థలకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధి భర్త దర్జాగా ఆక్రమణకు పాల్పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే జనసేన పార్టీ కావడంతో ఆ పార్టీ నేతలతో కలిసి తిరుగుతున్నారు. దీంతో గెడ్డవాగు కబ్జా యత్నాన్ని అడ్డుకోవడానికి అధికారులు ముందూ వెనుకా ఆలోచిస్తున్నారు.

ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలోని పరవాడపాలెం పంచాయతీలో సర్వే నంబరు 63/9లో గెడ్డవాగు వుంది. ఇది రోడ్డుకి ఆనుకొని వుండడం, జాతీయ రహదారికి చేరువలో వుండడంతో ఇక్కడ సెంటు రూ.5 లక్షలు పలుకుతున్నది. దీంతో గెడ్డవాగుకు చెందిన 42 సెంట్ల ప్రభుత్వ స్థలంపై స్థానిక నేత కన్ను పడింది. రాజకీయంగా 'సూపర్'గా వ్యవహరిస్తున్న ఇతను వాస్తవానికి తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీ నేతలతో అంటకాగారు. 2022వ సంవత్సరంలో గెడ్డవాగు స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించగా.. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి, స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గత ఏడాది కూటమి అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే జనసేన పార్టీ కావడతో ఇతను ఆ పార్టీ నేతగా ప్రచారం చేసుకుంటున్నారు. గెడ్డవాగు స్థలాన్ని ఆక్రమించి, దానికి ఆనుకుని వున్న తన జిరాయితీ భూమిలోకి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ సెంటు స్థలం రూ.5 లక్షలు పలుకుతున్నది. ఈ ప్రకారం గెడ్డవాగు

... మిగతా 6వ పేజీలో

సంస్థాగత ఎన్నికలకు టీడీపీ సన్నద్ధం

మండల, నియోజకవర్గం, జిల్లా కమిటీల నియామకానికి ఏర్పాట్లు

- మూడు పర్యాయాలు లేదా వరుసగా ఆరేళ్లపాటు పదవులు నిర్వహించిన వారికి నో ఛాన్స్
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలకుల నియామకం

నర్సీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. జిల్లా, నియోజకవర్గం, మండలస్థాయి కమిటీల ఏర్పాటుకు పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. మూడు పర్యాయాలు, లేదా వరుసగా ఆరేళ్లపాటు పదవులు నిర్వహించిన వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రెగ్యులర్ అబ్జర్వర్ ఒకరు, ఇద్దరు ఎలక్షన్ అబ్జర్వర్లను నియమించింది. చోడవరం నియోజకవర్గానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా గొంప కృష్ణ, ఎలక్షన్ అబ్జర్వర్లుగా మాదంశెట్టి నీలబాబు, వేగి పరమేశ్వరరావు, మాడుగులకు రెగ్యులర్ అబ్జర్వర్‌గా వాసిరెడ్డి యేసుబాబు, ఎలక్షన్ అబ్జర్వర్లుగా కోండ్రు మరిడయ్య, బొడ్డేడ నాగ గంగాధర్, అనకాపల్లికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా గంటా నూకరాజు, ఎలక్షన్ అబ్జర్వర్లుగా దాసరి శ్రీనివాస్, డొక్కా నాగభూషణం నియమితులయ్యారు. పెందుర్తి నియోజకవర్గానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా కోరాడ రాజబాబు, ఎలక్షన్ అబ్జర్వర్లుగా బీమరశెట్టి శ్రీనివాసరావు, రొంగలి మహేశ్, ఎలమంచిలికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా బొండా జగన్నాథం, ఎలక్షన్ అబ్జర్వర్లుగా ఆళ్ల మంగరాజు, బొడ్డేడ శ్రీనివాసరావు, పాయకరావుపేటకు రెగ్యులర్ అబ్జర్వర్‌గా చప్పిడి వెంకటేశ్వరరావు, ఎలక్షన్ అబ్జర్వర్లుగా పుల్లేటికుర్తి అప్పలరమేశ్, మళ్ల గణేశ్‌కుమార్, నర్సీపట్నానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా పీలా శ్రీనివాసరావు, ఎలక్షన్ అబ్జర్వర్లుగా బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు నియమితులయ్యారు.

పేదింట సాహితీ కెరటం

మత్స్యకార గ్రామం నుంచి ఎదిగిన యువ రచయిత ప్రసాద్

- రాసింది కేవలం మూడు నవలలు
- కేంద్ర సాహిత్య యువ పురస్కారానికి ఎంపిక



అచ్యుతాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):

అతను పుట్టింది ఓ నిరు పేద మత్స్యకార కుటుంబంలో. ఇంటర్మీడియట్ పూర్తయ్యాక చదివించే స్థోమత లేదని తల్లిదండ్రులు చెప్పడంతో హైదరాబాద్ చేరుకున్నాడు. ఓ బార్‌లో ఏడాది పాటు పని చేశాడు. ఆ డబ్బులతో అక్కడి జవహర్ లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ పూర్తిచేశాడు. ఖాళీ సమయంలో కలం పేరుతో మూడు నవలలు రాశాడు. అందులో 'మైరావణ' నవలకు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం దక్కింది. తన రెండవ నవలకే ప్రతిష్ఠాత్మక పురస్కారం రావడం ఆనందంగా ఉందంటున్నాడు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడరాంబిల్లి మత్స్యకార గ్రామానికి చెందిన సూరాడ ప్రసాద్.

సూరాడ చంద్రరావు, నూకరత్నం దంపతులకు 2000 డిసెంబరు 12న ప్రసాద్ జన్మించాడు. స్వగ్రామం వాడనర్సాపురం అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల వాడరాంబిల్లిలో అమ్మమ్మ వద్ద ఉంటూ 2016లో పదవ తరగతి పూర్తిచేశాడు. 2018లో ఎలమంచిలి

... మిగతా 6వ పేజీలో

ఎంతో ఆనందంగా ఉంది



నేను కేవలం మూడు నవలలే రాశాను. మొదటిది మై నేమ్ ఈజ్ చిరంజీవి, రెండోది మైరావణ, మూడవది బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్. నేను కేంద్ర సాహిత్య యువ పురస్కారానికి ఎంపికయ్యానని తెలిసి ఎంతో ఆనందపడ్డాను. గ్రామంలో, కుటుంబంలో నన్ను ప్రోత్సహించేవారు లేకపోయినా సరే, నా తెగింపే నన్ను ఇంత వరకూ తీసుకువచ్చింది. డిగ్రీ చదివే సమయంలో కాలేజీలో చాలామంది నన్ను ప్రోత్సహించి, ఆర్థికంగా కూడా సహకరించారు. నాతో పాటు అనేక మంది ఈ సాహిత్య పురస్కారానికి పోటీ పడ్డారు. నా అదృష్టం కొద్దీ నన్ను ఈ పురస్కారం వరించింది. ప్రభుత్వం యువ రచయితలను మరింత ప్రోత్సహిస్తే రానున్న కాలంలో గొప్ప రచనలు ముందుకు వస్తాయి.

- సూరాడ ప్రసాద్
(కలం పేరు ప్రసాద్ సూరి),
మైరావణ రచయిత

యోగాంధ్రకు ప్రత్యేక ఏర్పాట్లు

- ప్రతి సచివాలయ పరిధిలోనూ నిర్వహణ
- ఎలమంచిలి నుంచి విశాఖకు 4 వేల మంది ..
- ఎలమంచిలిలో పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల మండలాల విద్యార్థులు రాత్రి బస

ఎలమంచిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి ఎలమంచిలిలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలమంచిలి మునిసిపాలిటీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి విశాఖకు 4 వేల మందిని తరలివెళ్లేందుకు ప్రతి గ్రామ, వార్డులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎలమంచిలి ప్రాంతం నుంచి 21వ తేదీ వేకువజామున 3 గంటలకు బస్సులు విశాఖకు బయలుదేరనున్నాయి. ప్రతీ సచివాలయం, మునిసిపల్ కార్యాలయం, కోర్టు సముదాయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద యోగాసనాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల మండలాల నుంచి 3,340 మందిని వాహనాల్లో 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎలమంచిలికి తీసుకువచ్చి రాత్రి బస చేయిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. వీరందరికీ పట్టణంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో రాత్రి బస ఏర్పాట్లు చేస్తున్నారు. 21వ తేదీన తెల్లవారుజామున వీరంతా విశాఖపట్నం వెళతారు. రాత్రి బస చేసే కళాశాలలు, పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు ఉండేలా రెవెన్యూ, మునిసిపల్, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖల అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. గురువారం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, రెవెన్యూ డీటీ వినయ్‌లతో కలిసి పాఠశాలల్లో ఏర్పాట్లు పరిశీలించారు.

పాయకరావుపేటలో..

పట్టణంలో శనివారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పీఆర్ గెస్టుహౌస్


పాయకరావుపేట విద్యార్థులకు రాత్రి బస కోసం కొత్తపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మునిసిపల్, రెవెన్యూ అధికారులు

ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా శనివారం విశాఖలో జరగనున్న యోగాంధ్రలో పాల్గొనే వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో స్థానిక అధికారుల ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. పాయకరావుపేట పట్టణంలో 150 మంది పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించే యోగాంధ్రలో పాల్గొనేందుకు పాయకరావుపేట నుంచి రెండు బస్సుల్లో వంద మంది ఒకరోజు ముందుగా శుక్రవారం సాయంత్రం వెళుతున్నారన్నారు. వీరందరికీ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నందున శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలోని పీఆర్ గెస్టుహౌస్ వద్దకు రావాల్సి ఉంటుందన్నారు.

యోగా కార్యక్రమానికి 557 మంది

మునగపాక: విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగా


'పేట'లో యోగా దినోత్సవం నిర్వహించనున్న పీఆర్ గెస్టు హౌస్ ఆవరణ

దినోత్సవంలో మండలం నుంచి 557 మంది పాల్గొననున్నారని తహసీల్దార్ ఎస్ఎ.ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. మునగపాక, నాగులాపల్లి జడ్పీ హైస్కూళ్లు, ప్రగతి, ప్రణతి ప్రైవేటు స్కూళ్లో 8,9,10వ తరగతులు చదువుతున్న 457 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. వారిని విశాఖకు 10 బస్సుల్లో తీసుకువెళతామన్నారు. ఎంపీడీవో ఉషారాణి మాట్లాడుతూ స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపం నుంచి 100 మందిని రెండు బస్సుల్లో తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ఏవో ప్రసాదరావు, యోగా గురువు దొరమ్మనాయుడు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో యోగాంధ్ర

అచ్యుతాపురం: ఈనెల 21న జరిగే యోగా డేని ఘనంగా నిర్వహించడానికి కూటమి నేతలతోపాటు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో గల ప్రతీ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల గ్రౌండ్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, మండల కాంప్లెక్స్ ఆవరణలో గ్రౌండ్‌ని సిద్ధం చేస్తున్నారు. మండల కాంప్లెక్స్‌లో యోగా డేని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.


నక్కపల్లిలో యోగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

క్రీడాకారులకు యోగా శిక్షణ

నక్కపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ హాకీ మైదానంలో గురువారం ఉదయం బాక్సింగ్, టైక్వాండో, హాకీ క్రీడాకారులకు డీఎస్‌డీవో ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ పీడీ లక్ష్మి, యోగా గురువు దవరసింగి రాంబాబు యోగాపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా వుండాలన్న ఉద్దేశంతోనే యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ, హాకీ, బాక్సింగ్, టైక్వాండో కోచ్‌లు పాల్గొన్నారు. సాయంత్రం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో యోగా గురువు రాంబాబు యోగా శిక్షణ ఇచ్చారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో విద్యార్థులకు యోగా మాస్టర్ ట్రైనర్ ఆచార్యులు శిక్షణ ఇచ్చారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కోటవురట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజుపేట యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్. నాని మణిమోహన్ అన్నారు. గురువారం మండలంలోని యూపీ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఈనెల 21వ తేదీన విశాఖలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ ఎస్. సంగీత్‌రాజ్, కృపామణి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు కాలుష్యంపై ఏపీఐఐసీ అధికారులకు ఫిర్యాదు


ఏపీఐఐసీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక ఉప్పుటేరులో కర్మాగారాల నుంచి కాలుష్య కారక జలాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు గురువారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్ కృష్ణవేణికి వినతిపత్రాన్నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెజ్‌లో గల ఫార్మా కర్మాగారాల నుంచి వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా పూడిమడక సముద్రంలోకి విడిచిపెడుతున్నారన్నారు. దీనివల్ల ఉప్పుటేరులో చేపలు చనిపోతున్నాయన్నారు. అదే వ్యర్థజలాలు ఉప్పుటేరు దాటి సముద్రంలో కలిస్తే అక్కడ చేపలు కూడా చనిపోతాయన్నారు. ఈ సమస్యపై ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన చర్యలు తీసుకోకపోతే భారీ స్థాయిలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పూడిమడక మాజీ సర్పంచ్ చోడిపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు, రేవిడి ఆనందరావు, మేరుగు అప్పలరాజు, ఎరిపల్లి చిట్టిబాబు, కొవిరి బందయ్య, చడిపల్లి అమ్మోరయ్య పాల్గొన్నారు.

తల్లికి వందనం ఇవ్వండి

అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నక్కపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గౌరవ వేతనం మాత్రమే తీసుకుంటూ అనేక ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి కోరారు. ఈ మేరకు గురువారం నక్కపల్లిలో ఎంపీడీవో డీ సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. తమ పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో, తహసీల్దార్ చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60,500 సాయాన్ని గురువారం పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు తదితరులు బాధితురాలు జగతా రాజేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు గూటూరు శ్రీను, పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకటరమణ, పెంకే గోవిందు, పల్లా ప్రసాద్, రాజాన ఆది, ఎం.దుర్గాప్రసాద్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీ

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

అచ్యుతాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో మన దేశం అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని దొప్పెర్లలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేయలేని అభివృద్ధి మోదీ 11 ఏళ్లలో చేసి చూపించారన్నారు. గతంలో 11వ స్థానంలో ఉన్న భారత్ ఆర్థిక వ్యవస్థని ప్రస్తుతం నాల్గవ స్థానానికి తీసుకువచ్చారన్నారు. రానున్న కాలంలో రెండో స్థానానికి చేరుతుందన్నారు. మోదీ సహాయ సహకారాలతో అనకాపల్లి జిల్లా రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే అధిక ఆదాయం గల జిల్లాగా ఎదుగుతుందన్నారు. ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం సెజ్‌లో పలు కర్మాగారాలు రానున్నాయన్నారు. ఈసందర్భంగా ఎంపీ రమేశ్‌ని దొప్పెర్ల నాయకులు గజ మాలతో సత్కరించారు. దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వికసిత భారత్ కన్వీనర్ వీవీఎస్ వర్మ, ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, నేతలు నాయుడు బాబు గొంతిన భక్త సాయిరాం, ద్వారపురెడ్డి బాపూజీ, చుక్క అనూరాధ, పిన్నమరాజు వాసు, సతీష్ రాజు, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం మండలంలోని పీఎల్ పురం గ్రామంలో బీజేపీ


పాయకరావుపేట రూరల్: మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్



అచ్యుతాపురం : సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

నాయకుడు శ్రీరంగం రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో లక్షల కోట్ల రూపాయలతో పరిశ్రమలు స్థాపిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మోదీ సహకారంతో ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వికసిత భారత్ జిల్లా కన్వీనర్ బీవీఎస్ వర్మ, జిల్లా కో కన్వీనర్ డాక్టర్ భరత్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేశ్, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, బీజేపీ నాయకులు రవిరాజు, మంచాల గాంధీ, వేముల వెంకటేశ్వరరావు, కోనే రంగయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నక్కపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి హైవే వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ కె.కుమారస్వామి తెలిపిన వివరాలివి. మండలంలోని కాగిత గ్రామానికి చెందిన బి.రామారావు (64) ద్విచక్ర వాహనంపై నక్కపల్లి వస్తుండగా, తుని నుంచి నక్కపల్లి వైపు వస్తున్న తమిళనాడుకు చెందిన లారీ ఢీకొంది. దీంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

టీడీపీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల అధ్యక్షుల నియామకం

రాంబిల్లి అధ్యక్షుడిగా లాలం భరత్..అచ్యుతాపురానికి పీలా తులసీరామ్

ఎలమంచిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల అధ్యక్షులుగా లాలం భరత్, పీలా తులసీరామ్‌లను గురువారం ఎన్నుకున్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో జరిగిన రెండు మండలాల ముఖ్య నేతల సమావేశంలో వీరిని ఎన్నుకున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తెలిపారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ, తదితర నేతల సమక్షంలో ఎన్నుకున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా మండల అధ్యక్షులు సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారంజక పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యకర్తల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను నేతలంతా శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు, ఎలమంచిలి మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె నానాజీ, పెంటకోట విజయ్, సేనాపతి నాగేశ్వరరావు, లాలం తాతబాబు, కాండ్రేగుల సూర్యనారాయణ, రెడ్డి నగేష్ పాల్గొన్నారు.


నూతన మండల అధ్యక్షులను అభినందిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు

బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తుంటే పట్టించుకోరా?

మండల సమావేశంలో ఎక్సైజ్ అధికారిని నిలదీసిన ఎంపీటీసీ సభ్యులు

ఎస్.రాయవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నుంచి గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు ఆటోల్లో మద్యం కేసులను తరలిస్తుంటే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని సైతారుపేట, ఎస్.రాయవరం ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది తమ శాఖల ప్రగతిని వివరించారు. తొలుత ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మాట్లాడుతుండగా సైతారుపేట, ఎస్.రాయవరం ఎంపీటీసీ సభ్యులు సేనాపతి రాము, బైపా శ్రీనివాసరావు కలుగజేసుకొని గ్రామాల్లో బెల్టు షాపులకు ఆటోలపై పెద్దఎత్తున మద్యాన్ని తరలిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ అక్రమంగా ఎవరైన మద్యం తరలిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ జె.రమేశ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో 150 గజాలను ఆక్రమించి ఇల్లు నిర్మించుకొన్నవారికి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అయితే వారి కరెంట్ బిల్, ఇంటి పన్ను రశీదు సమర్పించాలన్నారు. అటువంటి వారందరికీ పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పలు గ్రామాల్లో భూ రీసర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వమ్మవరం ఎంపీటీసీ సభ్యుడు బాలం సూరిబాబు మాట్లాడుతూ కొరుప్రోలు రెవెన్యూలో రీసర్వేను వేగంగా ప్రారంభించాలని కోరారు. పశు వైద్యాధికారి భరత్ మాట్లాడుతూ గోకులం షెడ్లు కావాల్సిన రైతులు వాటి కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమయంలో వమ్మవరం ఎంపీటీసీ సభ్యుడు జోక్యం చేసుకొని రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ గోకులం షెడ్లు ఇస్తారా అని ప్రశ్నించారు.


ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు సేనాపతి రాము, బైపా శ్రీనివాసరావు

సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కొండబాబు, వైస్ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పన్న, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, పలువురు ఎంపీటీసీ సభులు, సర్పంచులు, హౌసింగ్ ఏఈ యుగేందర్, ఏపీవో ఎరకయ్య, ఏవో సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆశయ సాధనకు యువత నడుం బిగించాలి : పప్పల


వెంకటస్వామిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన టీడీపీ ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పెదపల్లి గ్రామానికి చెందిన దంట్ల వెంకటస్వామి తన అనుచరులు, కుటుంబ సభ్యులతో గురువారం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నేతలు, యువత నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటస్వామిని పప్పల చలపతిరావు శాలువాకప్పి అభినందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరరావు, బొద్దపు సన్యాసిరావు, అశోక్‌కుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు జనసేనలో చేరిక


జనసేన పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సోదరులు

అచ్యుతాపురం/రాంబిల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ, రాంబిల్లి మండలం లాలంకోడూరు నుంచి వైసీపీ శ్రేణులు గురువారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇరువాడ సర్పంచ్ పిల్లా సతీశ్ ఆధ్వర్యంలో 300 మంది అచ్యుతాపురంలో గల ఎమ్మెల్యే స్వగృహం వద్ద జనసేనలో చేరారు. అలాగే రాంబిల్లి మండలం లాలంకోడూరు మండల వైస్ ఎంపీపీ కసిరెడ్డి నర్సింగరావు, మాజీ సర్పంచ్ గుణాకర్ ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు జనసేనలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆయన సోదరుడు సతీష్ కుమార్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముత్యాల నాయుడు, పైడిరాజు, వెంకటరమణ, పోతురాజు రమణమూర్తి, రమేష్ నాయుడు, లోవరాజు, సూర్యప్రకాశరావు, రమణ మూర్తి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ

మునగపాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ సచివాలయం వద్ద గురువారం వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు జేకే నాయుడు, దొడ్డి కోటేశ్వరరావు, పొలమరశెట్టి మురళీకృష్ణ, ఏవీ సత్యనారాయణ, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా శంకర్


శంకర్‌ను సత్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

మునగపాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనుబంధ కమిటీలు ఏర్పాటయ్యాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ తెలిపారు. చూచుకొండ గ్రామానికి చెందిన కాండ్రేగుల శంకర్ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగాను, మునగపాకకి చెందిన పెంటకోట శ్రీరామ్మూర్తి ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. వారిని గురువారం అచ్యుతాపురంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు అభినందించారన్నారు.

పేదలకు కేంద్రం సుపరిపాలన

రాంబిల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):పేదలకు బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల మంచి సుపరిపాలన అందించిందని బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్పం కార్యక్రమంలో ఆయన బీజేపీ కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వికసిత భారత్ సంకల్పాన్ని నెరవేరుస్తానని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీఎస్ వర్మరాజు, ఉమ్మిడి వెంకటేశ్వర్లు, ధర్మాల గోవిందరెడ్డి, ఎస్.ధర్మతేజ్, రవితేజ పాల్గొన్నారు.

సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

మునగపాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రియదర్శిని ఇంగ్లీషు మీడియం హైస్కూళ్లో సరస్వతిదేవి విగ్రహాన్ని గురువారం మహిళా పోలీసులు, ఎంఈవో బుద్ధ శివనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సరస్వతిదేవి విగ్రహం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. స్కూల్ కరస్పాండెంట్ వేగి వీరునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


క్రికెట్ కిట్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు మేడేటి శంకర్

నక్కపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మేడేటి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి శివారు అప్పలపాయకరావుపేటలో క్రీడాకారులకు రూ.10వేలు విలువైన క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నీలి అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా బంగారుతల్లి జాతర

ఎస్.రాయవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం బంగారుతల్లి జాతరను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం

▸ గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహణ

▸ భారీగా తరలి వచ్చిన భక్తజనం


వేడుకను వీక్షించేందుకు తరలి వచ్చిన పట్టణవాసులు

అనకాపల్లి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవంలో భాగంగా గురువారం రాత్రి దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజల జరిపారు. అనంతరం అర్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మళ్ల రాజా, లహరి, బొడ్డేడ బాల సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మి దంపతులు కల్యాణంలో కూర్చొన్నారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, స్థానిక పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎటు చూసినా 'యోగాంధ్ర' సందడే

▸ జిల్లాలోని ఆయా మండలాల నుంచి వచ్చే వారిని విశాఖకు చేర్చడంతో పాటు తిరిగి స్వగ్రామాలకు వెళ్లేలా అధికారులు సన్నాహాలు ▸ సిబ్బందికి దిశా నిర్దేశం ▸ ఏర్పాట్లు పర్యవేక్షణ


ఎన్టీఆర్ స్టేడియంలో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి


పూడిమడక రోడ్డులో నిలిచిన రాయలసీమ బస్సులు


ఇరువాడ జీవీఎస్ కన్వెన్షన్లో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో శనివారం జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవానికి అనకాపల్లితో పాటు కె.కోటపాడు, నర్సీపట్నం, మాకవరపాలెం, రోలుగుంట మండలాలకు చెందిన విద్యార్థులను తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. పట్టణంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో వీరికి వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. వీరంతా శుక్రవారం సాయంత్రానికి వారికి కేటాయించిన స్కూళ్లకు చేరుకుంటారని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రికి వీరికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనకాపల్లి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న తొమ్మిది, పది తరగతుల విద్యార్థులను ఈ యోగా డేకు పంపనున్నారు. అలాగే కళాశాలల విద్యార్థులు కూడా ఆయా కళాశాలల ఆధ్వర్యంలో వెళ్లనున్నారు. ఇప్పటికే పట్టణంలోని పదమూడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. శనివారం వేకువజామున మూడు గంటల సమయంలో విద్యార్థులను విశాఖనగరంలో కేటాయించిన వేదిక ప్రాంతానికి ఆర్టీసీ బస్సుల్లో తీసుకువెళ్లేందుకు చర్యలు చేపడుతున్నారు. ఒక్క అనకాపల్లి పట్టణం, మండలం నుంచి వంద వరకు ఆర్టీసీ బస్సులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఏది ఏమైనా యోగా డేను విజయవంతం చేయడమే లక్ష్యంగా రెవెన్యూ, పోలీస్ అధికారులు నిమగ్నమయ్యారు. ఇదిలావుంటే, యోగా దినోత్సవానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సిద్ధమవుతున్నట్టు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది సుమారు రెండు వందల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యామన్నారు.

డ్రైవర్లతో డీఎస్పీ శ్రావణి సమావేశం

అనకాపల్లి టౌన్ : యోగా డేకు బయల్దేరే విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి, తిరిగి తీసుకురావాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఆర్టీసీ డ్రైవర్లతో ఆమె మాట్లాడారు. సమయానికి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకొని అధికారులు సూచించిన వేదిక ప్రదేశానికి తీసుకువెళ్లాలన్నారు. అనకాపల్లి నుంచి వెళ్లే బస్సులు చిన్నయ్యపాలెం, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శొంఠ్యాం అండర్‌బ్రిడ్జి, అడవివరం, హనుమంతవాక, లా కళాశాల, ఐటీ సెజ్ దారిలో ప్రయాణించి అక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్దకు సురక్షితంగా చేర్చాలన్నారు. అలాగే యోగా డే కార్యక్రమం పూర్తయిన తరువాత విద్యార్థులందరినీ తిరిగి అనకాపల్లికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాయలసీమ నుంచి 200 బస్సులు రాక

అనకాపల్లి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో యోగాంధ్ర -2025 కార్యక్రమానికి విద్యార్థులను తరలించేందుకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన బస్సులతో గురువారం సందడి నెలకొంది. విద్యార్థులను తరలించేందుకు రాయలసీమ నుంచి 200 వరకు బస్సులు అనకాపల్లికి చేరుకున్నాయి. దీంతో నెహ్రూచౌక్ నుంచి పూడిమడకరోడ్డులోని జాతీయ రహదారి వరకు బస్సులు ఒక పక్కన నిలిచిపోవడం వలన ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులకు ట్రాఫిక్ సమస్య తప్పలేదు. అనకాపల్లికి చేరిన తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వచ్చిన 200 బస్సులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రభుత్వం కేటాయించింది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులకు ఇంధన సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారులు డిపోలో బుధవారం అర్ధరాత్రి నుంచి వచ్చిన బస్సులకు ఆయిల్ నింపి అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపేందుకు సిద్ధం చేశారు. ఈ కారణంగా గురువారం సాయంత్రం వరకు బస్సులు అనకాపల్లిలోనే నిలిచిపోయాయి. సాయంత్రం వరకు బస్సులకు ఇంధనం నింపి అల్లూరి జిల్లాకు పంపినట్టు డీఎం ఎల్వీ రావు తెలిపారు. సాయంత్రం నుంచి ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

సబ్బవరంలో 2892 మందికి బసకు ఏర్పాట్లు : తహసీల్దార్

సబ్బవరం : విశాఖలో శనివారం జరగనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ కోరారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. చోడవరం, చీడికాడ, కోటపాడు మండలాల నుంచి 2892 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రికి సబ్బవరం చేరుకుంటారన్నారు. వారందరికీ పదకొండు చోట్ల స్కూల్స్, కళాశాలలు, పాఠశాలలు, కల్యాణ మండపాలలో బస ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి వెన్యూ కేంద్రానికి ఇన్‌చార్జిలను నియమించామన్నారు. వారు విద్యార్థులకు ఎటువంటి లోటుపాటు లేకుండా చూస్తారని వివరించారు. శనివారం ఉదయం రెండు గంటలకు విద్యార్థులు బస చేసే వెన్యూ కేంద్రాలకు బస్సులు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం 63 బస్సులను కేటాయించడం జరిగిందన్నారు. వీరందరినీ విశాఖలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కేంద్రానికి సదరు బస్సుల్లో తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సీహెచ్ .అప్పారావు, రీసర్వే డీటీ గణేశ్, ఆర్ఐ వీరయ్య, ఏఈ అశోక్, సర్వేయర్ ఎల్.అప్పారావులతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేతలకు సత్కారం


విజేతలను సత్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్ : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానంలో నిచిన వారిని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర గురువారం తన నివాసంలో సత్కరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి యోగా లైఫ్ సభ్యులు కోన శ్రీనివాసరావు, డాక్టర్ కొణతాల అర్చన, కాండ్రేగుల శ్యామ్, కోట్ని గణేశ్, శరగడం చేతన్‌లు ప్రథమ స్థానంలో నిలవడంతో వారిని సురేంద్ర అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి సత్యనారాయణ, యల్లపు కల్యాణ్, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజు,లక్ష్మి, మణి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణపై వైద్య సిబ్బంది ప్రచారం


చేనుల అగ్రహారం గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తుమ్మపాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మలేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.మంగమ్మ పిలుపునిచ్చారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం చేనుల అగ్రహారం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వారానికి ఒక రోజు డ్రై డేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో వెళుతున్న లారీపై చర్యలు

▸ రూ.80 వేలు జరిమానా విధించిన రవాణా శాఖ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఓవర్ లోడ్ క్వారీ లారీ

కశింకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి అధిక లోడుతో వెళుతున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ అల్లు స్వామి నాయుడు ఆ లారీకి ఉన్న పరిమితిని పరిశీలించగా, పరిమితికి మించి అధిక బరువు ఉండడంతో ఆర్టీవో అధికారులకు అప్పగించారు. దీంతో రూ.80 వేలు జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

యోగాపై విద్యార్థులు ర్యాలీ



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం/కశింకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : యోగాపై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన పెంచుకోవాలని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ పిలుపునిచ్చారు. కళాశాలలో గురువారం యోగాంధ్రపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యోగా సాధన ద్వారా సర్వారోగాలను నివారించ వచ్చునన్నారు. యోగా పోటీల్లో జాతీయ స్థాయి విజేత పందూరి జయలక్ష్మి ఆసనాలు, వాటి వల్ల ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ రత్నప్రకాశ్, ఎంవీ రామకృష్ణ, లక్ష్మి, ఎం.గోవిందరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేశ్, వీఆర్వో రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కశింకోట మండలం తాళ్లపాలెంలో యోగాపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, కూటమి నాయకులు, పలువురు గ్రామస్థులు కలిసి యోగాసనాలు వేశారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం సాగించవచ్చునని ఎంపీడీవో తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

'సికిల్ సెల్ ఎనీమియాపై విస్తృత అవగాహన'


పోస్టర్ ఆవిష్కరణలో డీఎంహెచ్‌వో బాలాజీ తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సికిల్ సెల్ ఎనీమియా నివారణకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎంఎస్‌కే బాలాజీ సూచించారు. ఇక్కడి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2047 నాటికి జిల్లాలో సికిల్ సెల్ వ్యాధి సమూలంగా రూపుమాపాలన్నారు. గురువారం నుంచి జూలై మూడో తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రక్తపరీక్షలు చేసి వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 34,849 ట్రైబల్ టార్గెట్ జనాభాలో 4,290 మందికి స్క్రీనింగ్ చేయగా 57 మంది సికిల్‌సెల్ ట్రేట్, 11 మందికి సికిల్ సెల్ వ్యాధి గుర్తించడం జరిగిందన్నారు. వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వరహాల దొర, వైద్యులు శ్రావణి, ధాత్రీ ప్రియా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉడ్‌పేట హెడ్ పోస్టాఫీసులో సందడి

▸ తల్లికి వందనం పథకం డబ్బుల విత్ డ్రాకు పెద్ద సంఖ్యలో మహిళలు రాక

▸ ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలందిస్తున్న సిబ్బంది


పథకం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పోస్టాఫీస్‌లో ఉన్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని ఉడ్‌పేటలో గల హెడ్ పోస్టాఫీసు గురువారం కోలాహలంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి సంబంధించిన సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో వాటిని విత్ డ్రా చేసేందుకు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దీంతో పోస్టాఫీస్ కిటకిటలాడింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే పలువురు పడిగాపులు కాశారు. లబ్ధిదారులకు పథకం సొమ్ము అందించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని హెడ్ పోస్టుమాస్టర్ సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందు కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని వివరించారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' : ఐద్వా

పరవాడ : తల్లికి వందనం పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. గురువారం పరవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ బిల్లు 300యూనిట్లు దాటితే పథకం వర్తించదని ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. పథకానికి, కరెంటు బిల్లు లింకు పెట్టడం సరికాదన్నారు. అలాగే స్కీం వర్కర్లకుఈ పథకం వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, సభ్యులు లీలా, సీత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, మొగలిపురం, బోదివలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపురఅగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద

తుమ్మపాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామదేవత మరిడిమాంబ పండుగ గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపాలెం పంచాయతీ హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు సీతారామయ్య, స్థానిక నాయకులు సోమేశ్వరరావు, అప్పలరాజు, చినసోమేశ్‌తో పాటు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

'అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు మారాలి'

సబ్బవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమృతపురం, మలునాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యకుమారి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే పిల్లల తల్లిదండ్రులను కాన్వెంట్ల యాజమాన్యాలు చైతన్య పరిచి, వారి స్కూల్స్‌లో పిల్లలను చేర్చుకుంటుంటే మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తల్లిందండ్రులను కలిసి అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా విధానం, సౌకర్యాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వి.లలితకుమారి, సూపర్‌వైజర్ వై.ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యులు ప్రస్తావించిన ప్రతి సమస్యకు పరిష్కారం

▸ సబ్బవరం మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎంపీపీ సూర్యకుమారి ఆదేశం

▸ విద్యుత్ సమస్యపై ప్రశ్నించిన పలువురు ఎంపీటీసీలు


సమావేశంలో సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభలో ప్రస్తావించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సబ్బవరం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఎంపీపీ శాఖల వారీగా సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం అసకపల్లిలో సాగునీటి చెరువుల కింద గల పంట కాలువల్లో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ కర్రి అప్పారావు కోరారు. ఈ ఏడాది 4.12 లక్షల పనిదినాలు కూలీలకు కల్పించినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వసంతకుమార్ సబ్బవరం-4 ఎంపీటీసీ సభ్యుడు గొర్లి చైతన్య అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఫారం పాండ్స్, నీటి కుంటలు, పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు ఏపీవో తెలిపారు. పైడివాడ అగ్రహారంలో పెచ్చిట్టివారి కళ్లాల వద్ద గెడ్డ పూడిక తీత పనులు చేపట్టాలని, రోడ్డుకు ఏర్పాటుకు గ్రావెల్‌కు అవసరమైన అనుమతి ఇవ్వాలని ఎంపీటీసీ శీరం అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థ పాత పద్ధతిలో నడుస్తుందని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని డీటీ సీహెచ్.అప్పారావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని సీడీపీవో లలితకుమారి డీటీని కోరారు. సబ్బవరం సర్వే నెంబరు 255లో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాన్ని రద్దు చేశారని, మరోచోట ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు మాత్రం స్థలాన్ని కేటాయించ లేదని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ఆరోపించారు. దీనిపై డీటీ అప్పారావు మాట్లాడుతూ అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 84 పనులు గుర్తించి రూ.5.34 కోట్లతో చేపడుతున్నామని పీఆర్ ఏఈ హరిణి తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ సాగుతోందని ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. పది సెంట్లు పైగా భూమి ఉన్న వారు నమోదు చేసుకోవచ్చని ఎంపీటీసీ గొర్లి చైతన్య అడిగి ప్రశ్నకు ఏవో సమాధానమిచ్చారు. మండలంలో కొన్ని రోజులుగా విద్యుత్ సమస్య నెలకొందని, లో వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని పలువురు సభ్యులు వాపోయారు. రాంపురం వద్ద ట్రిప్ అవుతుండడం వలన సమస్య తలెత్తుతుందని, సమస్య పరిష్కారానికి పనులు జరుగుతున్నాయని ఏఈ అశోక్ తెలిపారు. సొంత స్థలాలు ఉన్నవారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, అర్హులు తమ స్థలాలను సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరికొంత మంది సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానం ఇచ్చారు. ఎంపీడీవో పి.పద్మజ, ఏవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ డి.చైతన్య, వైస్ ఎంపీపీ-1 ఝాన్సీలక్ష్మిరాణితో పాటు పలువురు అధికారులు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై శిక్షణ



జెన్‌కో ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న రిటైర్డు ఆర్మీ డాక్టర్ అశోక్

సీలేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జెన్‌కో ఇంజనీర్లు, కార్మికులకు గురువారం స్థానిక జెన్‌కో కల్యాణమండపంలో ప్రమాదాల నివారణ, ప్రథమ చికిత్సపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీ జెన్‌కో విద్యుత్ సౌధ విజయవాడ ట్రైనింగ్ సెంటర్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశిక్షణలో ఆర్మీ లో 22 సంవత్సరాలు వైద్యుడిగా పని చేసిన వై. అశోక్ ఉద్యోగులకు ప్రమాద సమయాల్లో ప్రథమ చికిత్సను ఏ విధంగా చేయాలి, వ్యక్తిత్వ వికాసం , మానసిక స్థైర్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈఈలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ఏడీఈ జైపాల్, ఏఈలు సురేష్, అనుదీప్, ఓఅండ్ఎం ఏడీఈలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై వ్యాస రచన పోటీల్లో గిరి బాలిక ప్రతిభ



గుజ్జెలి ధాత్రిక

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం నిర్వహించిన జూనియర్స్ విభాగ వ్యాసరచన పోటీల్లో గిరిజన బాలికల ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి లో మూడో స్థానంలో నిలిచింది. యోగాకు సంబంధించి జిల్లాలోని నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూసిప 8 మంది ఈ నెల 17న అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారిలో పాడేరు మండలం వంతాడపల్లి చెందిన బాలిక గుజ్జెలి ధాత్రిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ బాలిక రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంపై కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

దోమ తెరలు పంపిణీ



లబ్ధిదారులతో సర్పంచ్ తదితరులు

కొయ్యూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం కోరారు. రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబు గ్రామస్తులకు ముువ్వ ట్రస్టు సమకూర్చిన దోమ తెరలను రాంకీ ఫౌండేషన్ ప్రాంతీయ అధికారి కె. శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముువ్వ చిన బాపిరెడ్డి ట్రస్టు గడిచిన 10 పదేళ్లుగా రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ కో ఆర్డినేటర్ రాజేశ్వరితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తం



దిబ్బపాలెం వైద్యసేవలను అందిస్తున్న పినకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

అనంతగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పీహెచ్‌సీ పరిధిలోని జీనబాడు పంచాయతీ గంగవరం, పాలబంధ, దిబ్బపాలెంల్లో టీబీ ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన వారు షుగర్, ధూమపానం, మద్యపానం సేవించేవారు.. రెండు వారాలు దగ్గు ఉంటే తప్పనిసరిగా క్షయ పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ నగేశ్‌దొర, హెల్త్ అసిస్టెంట్ రామరాజు, ఎంఎల్‌హెచ్‌పీ తులసి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మూడో గురువారం రావాల్సిన 104 వాహనం రాకపోవడంతో పినకోట పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్‌సీహెచ్.పాత్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. నుర్మతి ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో నుర్మతి, భీరం, కిల్లంకోట, సింగర్భ గ్రామాల వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

జన్‌మన్ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలి: గిరిజన సంఘం

అరకులోయ,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. చినలబుడు పంచాయతీ గొందివలస తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలు, పీవీటీజీ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల బిల్లులు చెల్లింపుల్లో హౌసింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు పలువురు ఆరోపించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. 11 మండలాల్లో రూ.21.54 కోట్ల మేరకు బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ నెల 27న పాడేరు ఐటీడీఏ కార్యాలయంఎదుట ఈ బిల్లులపై నిరసన చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మల్లన్న, ప్రకాశ్, నగేస్, రాజారావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నార



పాడేరుప్రభుత్వ హైస్కూల్‌లో పీడీ సూరిబాబు పర్యవేక్షణలో యోగా శిక్షణ



అరకు డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు యోగా సాధన

యోగా డే విజయవంతానికి చర్యలు

- పాఠశాలల్లో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ
- విశాఖ వెళ్లేందుకు ఏర్పాట్లు

పాడేరురూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 21వ తేదీ శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర విజయవంతానికి పాఠశాల పీడీ సూరిబాబు పర్యవేక్షణలో యోగా ఉపాధ్యాయుడు కృషి చేస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్ తెలిపారు. పాడేరు డివిజన్ కేంద్రంలో ఉన్న తమ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులతో శనివారం ఉదయం 5 గంటలకు యోగాను ప్రారంభించేందుకుఅవసరమైన చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు కె.సూర్యకుమారి, బి.మహేశ్వరి, పి.ప్రసాదరావు, త్రినాధ్, కొండబాబు, దిలీప్ కుమార్, సీహెచ్. కేశవ తదితరులు పర్యవేక్షిస్తున్నారన్నారు.

సీలేరు: సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు భగీరథి యోగాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

చింతపల్లి నుంచి 1450మంది విద్యార్థులు

చింతపల్లి: విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 1,450మంది విద్యార్థులను తరలిస్తున్నట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి తెలిపారు. గురువారం విద్యార్థులను తీసుకువెళ్లేందుకు చింతపల్లికి 29 ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఈసందర్భంగా ఎంపీడీవో, ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో విద్యార్థులు ప్రయాణమవుతారన్నారు. రింతాడ, చింతపల్లి బాలూర-1,2, బాలికలు, లంబసింగి బాలుర, బాలకల ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు యోగా దినోత్సవంలో పాల్గొననున్నారన్నారు. అలాగే అదే రోజు మండల కేంద్రంతోపాటూ ప్రతి పంచాయతీలోనూ యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు.

అరకులోయ విశాఖపట్నంలో ఈనెల 21 నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి ప్రోటోకాల్ యోగాసనాల కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. యోగాంధ్రలో అందరూ భాగసాములు కావాలని పిలుపునిచ్చారు.

ఘాట్ రోడ్‌లో భారీ వాహనాలు రాకపోకలు నిషేధం

డుంబ్రిగుడ: యోగాంధ్రలో భాగంగా 19 నుంచి 21 వరకు ఘాట్‌రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలకు నిషేధించినట్లు స్థానిక ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. అరకు నియోజకవర్గం నుంచి విశాఖలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే ప్రజల కోసం సుమారు 500 ల బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అందువల్ల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 19 సాయంత్రం ఐదు గంటల నుంచి 21వ వరకు భారీ వాహనాలు నిషేధించామన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

చంద్రబాబుతోనే అరకు కాఫీకి విశ్వఖ్యాతి

- జీసీసీ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ
- సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

చింతపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ రుచిని ఖండాతరాలకు విస్తరింపజేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరితో కలిసి మండలంలో పర్యటించారు. జీసీసీ పెట్రోల్ బంక్, డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధి జీసీసీ అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జీసీసీ చైర్మన్ మాట్లాడుతూ ఆదివాసీలు పండించిన కాఫీకి గరిష్ఠ ధర అందించడంతోపాటు కాఫీకి ప్రత్యేక బ్రాండింగ్ తీసుకొచ్చే బాధ్యతను చంద్రబాబు తీసుకున్నారన్నారు. ప్రధాన పట్టణాలు, అసెంబ్లీ, పార్లమెంట్‌లలో జీసీసీ కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. కేవలం గిరిజన రైతుల శ్రమకు తగిన ఫలితం అందించాలనే లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జీసీసీ దివాలాతీసిందన్నారు.. జీసీసీకి పూర్వ వైభవం కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యచరణ రూపొందించారన్నారు. జీసీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్టు చెప్పారు. తాజాగా ఏపీపీఎస్సీ తరహా పరీక్ష నిర్వహించి పూర్తి స్థాయి డీఎంలను నియమిస్తామన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జీసీసీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నా రు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పౌరసరఫరాల సరకులు జీసీసీ డీఆర్ డిపోల ద్వారా ప్రజలకు పారదర్శకంగా పూర్తి స్థాయిలో అందించాలన్నారు. జీసీసీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జీసీసీని ఏ లక్ష్యంతో స్థాపించారో దానిని చంద్రబాబు నేడు ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. జీసీసీలో కారుణ్య నియామకాలపై చైర్మన్‌ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్, ఎస్‌హెచ్‌సీ, డీలర్లకు ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత చల్లంగి జ్ఞానేశ్వరి, జీసీసీ డీఎం బుక్కా వెంకటేశ్, బ్రాంచి మేనేజర్లు చల్లంగి సుగునాథం, సరమండ విజయ్ కుమార్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, సర్పంచ్ చింతర్ల సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

యువతి మృతిపై కేసు నమోదు



కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతి చెందిన కావేరి (ఫైల్‌ఫొటో)

సీలేరు, జూన్ 19 , (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మాదిమళ్ళ గ్రామానికి చెందిన కుయిలంగి కావేరి (20) పురుగులమందు తాగి విశాఖపట్నంలో కేజీహెచ్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వివరాలివి.. మాదిమళ్ళకు చెందిన కుయిలంగి సోన్ను కుమార్తె ఇంటర్ పూర్తి చేసింది. ఇటీవల ఆమెకు టైఫాయిడ్ జ్వరం సోకింది. అయితే, ఆమెను ధారకొండ పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. ఆమె భయంతో నిరాకరించింది. అయినా, ఒత్తిడి చేసి వైద్యం చేయిస్తారని ఆందోళనతో గత నెల 27న కావేరి ఇంట్లో ఉన్న పంటలకు ఉపయోగించే పురుగు మందు తాగింది. గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను ఒడిశా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ, మల్కనగిరి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స చేయించడంతో నయమైంది. ఈ నెల ఒకటో తేదీన మళ్లీ కడుపునొప్పి రావడంతో కావేరిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తర్వాత, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ కావేరి గురువారం కేజీహెచ్‌లో మృతి చెందింది. దీంతో తండ్రి సోన్ను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్ఐ తెలిపారు.

ఆదివాసీలకు సపోట, లిచి మొక్కలు పంపిణీ

గూడెంకొత్తవీధి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాబార్డు సహకారంతో ఆదివాసీ రైతులకు సపోట, లిచి పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు గిరిజన వికాస్ కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ తెలిపారు. గురువారం దేవరాపల్లిలో రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడెంకొత్తవీధి, దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని ఎంపిక చేసిన 16గ్రామాల పరిధిలోని 600మంది రైతులకు ఒక్కొక్కరికి 37 లిచి, 37 సపోటతోపాటూ జాఫ్రా మొక్కలు అందజేశామన్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్లు గాలి అనంతలక్ష్మి, మర్రి కృష్ణ, వనపల్లి జోగరాజు, మొట్టడం సురేశ్ పాల్గొన్నారు.

దోనుగుమ్మలులో ప్రత్యేక వైద్యశిబిరం

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాలుడిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సౌమ్య

గూడెంకొత్తవీధి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుగుమ్మలు గ్రామంలో వ్యాధులు అదుపులోనే ఉన్నట్టు ఆర్‌వీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్య తెలిపారు. గురువారం గ్రా మంలో మూడేళ్ల బాలు డు మృతి చెందడం, పలువురు ఆదివాసీలు జ్వరాలతో ఉండడంతో 'జ్వరాల విజృంభణ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ దినేశ్ కుమార్, డీఎంహెచ్‌వో జమీల్ బాషా స్పందించారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈమేరకు వైద్యాధికారి సౌమ్య, వైద్యసిబ్బంది గ్రామాన్ని సందర్శించి 30మందికి తనిఖీలు చేశారు. జ్వరబాధితులకు రక్తపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో రోగులకు మరో మూడు రోజుల పాటు వైద్యసేవలందిస్తారన్నారు.మలేరియా సూపర్‌వైజర్ శ్రావణి, ఏఎన్ఎం మంగలక్ష్మి, విజయ్, నెహ్రూ పాల్గొన్నారు.

కొయ్యూరులో 35.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మన్యంలో గురువారం ముసురు వాతావరణం నెలకొన్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పులేదు. దీంతో కొయ్యూరులో 35.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అనంతగిరిలో 31.9, పాడేరులో 30.9, అరకులోయలో 29.6, డుంబ్రిగుడలో 29.4, జీకేవీధిలో 29.1, పెదబయలులో 28.9, హుకుంపేటలో 28.8, జి.మాడుగులలో 28.2, చింతపల్లిలో 23డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ఉండాలి: డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సికెల్ సెల్ అనిమియా దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా ఆధ్వర్యంలో మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సికెల్ సెల్ అనిమియా పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా ఆస్పత్రిలో పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. వ్యాధి లక్షణాలు లేకున్నా పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. వంశపారంపర్య వ్యాధులలో ఇది ఒకటన్నారు. ఈ వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకూడదన్నారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీలలో ఇప్పటి వరకు 4,10,380 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 3,80,685 మందికి ప్రతికూల రిపోర్టు వచ్చిందన్నారు. సికెల్ సెల్ ట్రైట్ 12,599 మందికి రాగా సికెల్ సెల్ వ్యాధి 14,088 మందికి నిర్ధారణ అయిందన్నారు. వీరికి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్టు చెప్పారు. వ్యాధిగ్రస్థులకు పౌష్టికారం కొనుగోలుకు ప్రభుత్వం ప్రతీ నెల రూ.10 వేలు అందిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి టి.ప్రతాప్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారి ఎం.కిరణ్‌కుమార్, మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సాయిశ్రీ, సిబ్బంది జి.సింహాద్రి, టి.ఈశ్వరమ్మ, ఎం.సరోజిని, నేచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎం.శిల్పాసాక్షి పటేల్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా



డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడలో అవగాహన ర్యాలీ

డుంబ్రిగుడ: సికిల్ సెల్‌ఎనీమియా నిర్మూలనపై స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి రాకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అంబిక, శౌరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట: జీసీసీ చైర్మన్



విద్యార్థినులతో కలిసి ఫొటో తీసుకున్న చైర్మన్ శ్రావణ్, ఈశ్వరి

చింతపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, చైర్మన్, టీడీపీ నాయకులు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనాలు చేశారు. భోజనాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీసీసీ చైర్మన్ విద్యార్థినులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థను సమూల మార్పుకిశ్రీకారం చుట్టిందన్నారు. నాడు పుస్తకాల నుంచి చిక్కీల వరకు జగన్ బొమ్మలతో వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన కుమారుడుకి ఏమేరకు నాణ్యమైన యూనిఫారం, బ్యాంకు, పుస్తకాలు అందిస్తారో అదే తరహాలో ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు అందజేస్తున్నారన్నారు. బెల్టులు, బ్యాగ్, పుస్తకాల్లోనూ జెండా రంగులులేవన్నారు. గత ప్రభుత్వం రద్దుచేసిన కాస్మోటిక్స్‌ని వసతి గృహాల్లోని విద్యార్థులందరికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థిని బడికి పంపించాలనే భావనతో తల్లికి వదనం నగదు అందజేశారన్నారు. సన్నబియ్యంతో ఎంతో రుచికరమైన భోజనాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బీఎస్ఎన్ పడాల్, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, టీడీపీ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పూర్ణచంద్రరావు, రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, బేతాళుడు, సోమేశ్, అర్జున్, సత్యవతి, సర్పంచ్‌లు పాండురంగస్వామి, చింతర్ల సునీల్ పాల్గొన్నారు.

పాలీసెట్ అభ్యర్థులకు హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు



జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు

పాడేరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థుల సహాయం కోసం స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు తెలిపారు. హెల్ప్ లైన్ కేంద్రంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం నుంచి వచ్చే నెల 28వ తేదీ సోమవారం వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందన్నారు. అలాగే ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు ఆన్‌లైన్ ఎంపిక (వెబ్‌ఆప్షన్) ప్రక్రియ సాగుతుందన్నారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ శుక్రవారం నుంచి వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రోసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ప్రోసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ హాల్‌టిక్కెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, ఆధార్ కార్డుల ఒరిజినల్స్ , రెండు సెట్ల జిరాక్స్‌లతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు హెల్ప్‌లైన్ కేంద్రానికి హాజరుకావాలన్నారు. 1 నుంచి 15 వేలు ర్యాంక్ వచ్చిన అభ్యర్థులు 21వ తేదీన, 15 వేల 1 నుంచి 32 వేలు వచ్చిన వారు 22న, 50 వేలు వచ్చిన వారు 23న, 68 వేలు వచ్చిన వారు 24న, 86 వేలు వచ్చిన వారు 25న, లక్ష 4 వేలు వచ్చిన వారు 26న, లక్ష 20 వేలు వచ్చిన వారు 27న, లక్ష 20 వేల 1 పైబడి వచ్చిన అభ్యర్థులు 28వ తేదీన హాజరు కావాలన్నారు.

కాఫీ పంటకు సీజనల్ సస్యరక్షణ అవసరం



కాఫీ తోటల్లో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న జేఎల్‌వో రవి కుమార్

చింతపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేందుకు సీజనల్ సస్యరక్షణ అవసరమని కేంద్ర కాఫీ బోర్డు జేఎల్‌వో రవికుమార్ అన్నారు. గురువారం బలపం గ్రామ పంచాయతీలో గిరిజన రైతులు సాగుచేస్తున్న కాఫీ తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జేఎల్‌వో మాట్లాడుతూ ఈ ఏడాది కాఫీకి వర్షాలు అనుకూలించాయన్నారు. కాఫీ మొక్కలు గింజ దశలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం మొక్కల్లో పై కొమ్మలు, ఎండు కొమ్మలు తొలగించుకోవాలన్నారు. కాఫీతో తెగుళ్లు ఆశిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఎస్ఎల్‌వో శశి ప్రియా, ఏఈవో ధర్మరాయ్ పాల్గొన్నారు.

21న పరిశ్రమల ప్రతినిధులతో ముఖాముఖీ

పాడేరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రాయితీల కోసం దరఖాస్తులు చేసుకున్న వివిధ పరిశ్రమలు, సేవా సంస్థల ప్రతినిధులకు ఈ నెల 21వ తేదీన పాడేరు ఐటీడీఏలోని జిల్లా పరిశ్రమ కేంద్రంలో ముఖాముఖీ సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా పరిశ్రమల అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు గత రెండు వారాలుగా పరిశ్రమల శాఖ ద్వారా గతంలో నూ దరఖాస్తు చేసుకున్న వివిధ పరిశ్రమలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొవాలన్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సదస్సు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 85005 41363 సంప్రదించాలన్నారు.

'ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి'

కొయ్యూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగించాలని రాజేంద్రపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షుడు గోకిరి చిన్నారావు, కార్యదర్శి స్వామినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా వ్యాప్తంగా హైకోర్టు ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవడం హర్షనీయమన్నారు. వీటితో చెరువులు, పచ్చిక బయళ్లు, పుంతలు, పొలాలకు వెళ్ళే బండి బాటలు అడవికి వెళ్లే దారులు ఆక్రమణలను తొలగించాలని కోరారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా గుర్తించి ఆక్రమణలను తొలగింపునకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: ఏవో



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏవో ఎం.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కిలగాడ రైతు సేవా కేంద్రం వద్ద గురువారం రైతులకు రాయితీ వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో అంధకారం

సీలేరు, జూన్ 19 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో గత రెండు వారాలుగా విద్యుత్ సరఫరా లేక పలు గ్రామాల్లో గిరిజనులు చీకటిలో మగ్గుతున్నారని దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజెషన్ రాష్ట్ర అధ్యక్షుడు మార్క్‌రాజు తెలిపారు విద్యుత్ సమస్యపై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. రాత్రివేళల్లో ఇళ్ళలోకి విష సర్పాలు ప్రవేశించి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కలెక్టర్‌కు గుమ్మిరేవుల పంచాయతీలో కరెంట్ సమస్యపై ఫిర్యాదు చేస్తామన్నారు.

నీటి సరఫరా విభాగం కార్మికుల ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వాటర్ సప్లై కార్మికులు

నర్సీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మునిసిపాలిటీ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. నీటి సరఫరా విభాగం, స్ట్రీట్ లైట్లు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పార్కులలో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బందికి రూ.29వేలు, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది సంవత్సరాలు దాటిన మునిసిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఆప్కాస్ రద్దు చేసి కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ కార్మికులందరికీ పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు చేయాలని, గ్రాడ్యుటీతో పాటు కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని నినదించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లి మురళీ, మునిసిపాలిటీ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పలనాయుడు, కార్యదర్శి కరక మహేశ్, ఉపాధ్యక్షుడు యర్రా ప్రకాశ్, ట్రెజరర్ లాలం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం


చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకంలో మహిళలు, నేతలు

కృష్ణాదేవిపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం లింగంపేట, ఏఎల్‌పురం, సీహెచ్.నాగాపురం తదితర గ్రామాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో తల్లికి వందనం పథకం పొందిన లబ్ధిదారులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్, మాజీ సర్పంచులు పరవాడ అప్పలనాయుడు, కొలగాని రామారావు, గెడ్డం సత్యనారాయణ, కూటమి నాయకులు మరిశా రమణ, సలాదుల ప్రసాద్, లంక సత్యనారాయణ, బొడ్డు జమీలు, బొప్పన ప్రసాద్, గొలకొండ శ్రీకాంత్, పెట్ల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



మాకవరపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో గురువారం ఉదయం లారీ టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకు పోయింది. అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వెళుతున్న లారీ మాకవరపాలెం బస్‌స్టేషన్ వద్దకు వచ్చే సరికి ఈ సంఘటన జరిగింది. డివైడర్‌పైకి ఎక్కి, కుడివైపు మార్గంలోకి వచ్చి ఆగింది. ఈ ప్రమాదంలో లారీ కింద భాగం దెబ్బతిన్నది.

రైతులతో అధికారులు మమేకం కావాలి

- క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు
- రాయితీ విత్తనాల పంపిణీలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ 'కరక'



రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న కరక సత్యనారాయణ తదితరులు

నాతవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రసాయికి వెళ్లి, రైతులతో మమేకమై అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ కోరారు. నాతవరంలో గురువారం అధికారులతో కలిసి రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వ్యవసాధికారిణి సుగుణ మాట్లాడుతూ మండలానికి 1727 క్వింటాళ్ల వరివిత్తనాలు వచ్చాయన్నారు. వీటిలో ఆర్‌జీఎల్ 884 క్వింటాళ్లు, 1064 రకపు విత్తనాలు 764 క్వింటాళ్లు, ఎంపీవీ 1318, 33 క్వింటాళ్లు, సాంబమసూరి 16 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ రాష్ట్ర పామ్‌ఆయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పైల సూరిబాబు, టీడీపీ నాయకులు అంకంరెడ్డి యర్రా పాత్రుడు శెట్టి నానాజీ, శెట్టి గోపీ, చింతకాయల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెదబొడ్డేపల్లిలో ఆకట్టుకునేలా అల్లూరి విగ్రహం

- మదుం వద్ద రెండు వంతెనల మధ్యలో ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్న క్షత్రియ పరిషత్ ప్రతినిధులు


విజయవాడలో తయారు చేయించి తీసుకు వచ్చిన అల్లూరి భారీ విగ్రహం


నర్సీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పెదబొడ్డేపల్లి మదుం వద్ద గల రెండు వంతెనల మధ్యలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నర్సీపట్నం క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో అల్లూరి విగ్రహాన్ని తయారు చేయించారు. గురువారం ఉదయం విజయవాడ నుంచి విగ్రహాన్ని వాహనంలో తీసుకు వచ్చి పీఠంపై నిలబెట్టారు. పెదబొడ్డేపల్లి కూడలి దాటిన తర్వాత పట్టణంలోకి ప్రవేశించే వారికి రెండు వంతెనల మధ్యలో ఏర్పాటు చేస్తున్న ఈ భారీ అల్లూరి సీతారామరాజు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. విగ్రహం ముందు ప్రత్యేకంగా గ్రీనరీ, విద్యుత్ ల్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం క్షత్రియ పరిషత్ ప్రతినిధులు సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు. జూలై నాలుగో తేదీన అల్లూరి జయంతి రోజున విగ్రహం ప్రారంభోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వినతి


డీజీనాథ్‌కు వినతిని అందిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

నర్సీపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేయాలని ఎంటీఎస్ ఉపాధ్యాయులు గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలోని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో నియమించాలని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాథమిక, ఆదర్శ పాఠశాలల్లో క్లస్టర్స్ ఉపాధ్యాయులుగా ఉపయోగించుకోవాలని కోరారు. జూన్, జూలైలలో పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుల స్థానంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులను నియమించాలని విన్నవించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు పి.సాయిబాబు, వి.శివ తదితరులు పాల్గొన్నారు.

'వినియోగంలోకి భూసార పరీక్షా కేంద్రం'


భూసార పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తు ఏవో శ్రీదేవి

నర్సీపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గల నర్సీపట్నం భూసార పరీక్షా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏవో శెట్టి శ్రీదేవి తెలిపారు. నాలుగేళ్లగా మూత పడిన భూసార పరీక్షా కేంద్రాన్ని గురువారం ఆమె తెరిపించారు. లోపల యంత్ర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇన్నాళ్లూ వినియోగంలో లేక మట్టి నమూనాలు పరీక్షించడానికి ఉపయోగించే యంత్ర సామగ్రి పాడయ్యాయి. ముఖ్యంగా పీహెచ్ మిషన్, ఎలక్ట్రికల్ కండక్టవిటీ, కల్ ప్లస్ మీటర్లు, ఫ్రిజ్ పాడయ్యాయని ఆమె తెలిపారు. భూసార పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా లేదు. రసాయనాలు కొనుగోలు చేయాల్సి ఉంది. భవనం లోపల మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటన్నింటికీ ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ప్రస్తుతం ఏవో పోస్టు మాత్రమే ఉందని, మరో ఇద్దరు సహాయ సిబ్బంది అవసరం పడతారని వివరించారు.

తూటిపాల ప్రభుత్వ పాఠశాలలో ఒకే రోజు తొమ్మిది మంది చేరిక

- ప్రైవేటు స్కూళ్ల నుంచి అడ్మిషన్లు : ఎంఈవో


అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాకవరపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూటిపాల గ్రామంలో ఒకేరోజు తొమ్మిది మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరినట్టు ఎంఈవో మూర్తి గురువారం తెలిపారు. వీరంతా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో చేరినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యతో పాటు పుస్తకాలు, బూట్లు, బ్యాగులు తదితరాలు అందిస్తున్నామన్నారు. అలాగే, మధ్యాహ్నం భోజనం రుచికరంగా వండి వడ్డిస్తుండడంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

కృష్ణాదేవిపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా కన్వీనర్ బి.రత్నభరత్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొత్తమల్లంపేట, అమ్మపేట,గుండుపాల తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ కో-కన్వీనర్ వెలగా జగన్నాథం, గొలుగొండ మండల నాయకులు చిక్కిరెడ్డి రామదాసు, సాంబశివ, అంకంరెడ్డి దుర్గాప్రసాద్, ఎక్కల నాగేశ్వరరావు, రమణయాదవ్ పాల్గొన్నారు.

రెండు శివాలయాల్లో హుండీలు చోరీ

గొలుగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల, ధారమఠం గ్రామాల్లో వున్న శివాలయాల్లో మంగళవారం అర్ధరాత్రి హుండీలు చోరీకి గురైనట్టు ఆలయాల నిర్వాహకులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ రామారావు తెలిపారు. కేసు నమోదు చేసి బుధవారం ఆయా ఆలయాలకు వెళ్లి పరిశీలించినట్టు తెలిపారు.

బీఎన్ రోడ్డులో గుంతల పూడ్చివేతకు చర్యలు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కొత్తూరు జంక్షన్ వద్ద గోతులు పూడ్చివేత పనులను చేయిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంత పూడ్చివేతకు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ఎస్ రాజు శ్రీకారం చుట్టారు. దీనిలో భా గంగా గురువారం చోడవరం నుంచి వెంకన్నపాలెం వరకు ప్రధాన రహదారిలో గోవాడ, అంబేరుపురం జంక్షన్ల వద్ద ఉన్న గుంతలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు రోజుల్లో గుంతల పూడ్చివేత పనులు పూర్తి చేయాలని స్థానిక కాంట్రాక్టర్ సత్తిబాబును ఎమ్మెల్యే ఆదేశించారు. 'బాబోయ్ బీఎన్ రోడ్డు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ప్రత్యేక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే రాజు, నాయకులతో కలిసి గుంతల పూడ్చివేత చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేష న్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, డ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, ఎంపీడీవో ఆంజనేయులు, సీఐ అప్పలరాజు, కాంట్రాక్టర్ సత్తిబాబు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. గుంతలు పూడ్చివేతతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా దుర్గా అమ్మవారి ఊరేగింపు ఉత్సవం


కొత్తకోటలో దుర్గాఅమ్మవారి ఊరేగింపు

రావికమతం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటలో దుర్గాఅమ్మవారి ఆలయ 15వ వార్షిక మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైయ్యింది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవంను తొలిరోజు ఆలయ అర్చకులు వేపా రామకృష్ణ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పలు హోమాలతో ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని ఘనంగా నగర ఊరేగింపు ఉరేగించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజవర్గ అధ్యక్షురాలు కోట నీలవేణి, నాయకులు కోటగోవిందరావు, దొరబాబు, వెల్లంకి ఈశ్వరావు, కోట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

చీడికాడ: మండలంలోని అర్జునగిలో మరిడిమాంబ పండగను గ్రామస్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతోపాటు గ్రామ పెద్దలు దర్శించుకున్నారు.

మాడుగుల: మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలోని మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దేవరాపల్లి పశు వైద్యాధికారిగా గాయత్రీ దేవీ



దేవరాపల్లి, జూన్19 (ఆంధ్రజ్యోతి) దేవరాపల్లి పశు వైద్యాధికారి గా జి.గాయత్రీ దేవీ గురువారం బాధ్యతలు చేపట్టారు. చీడికాడనుంచి ఇక్కడకు ఆమె బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందు బాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. ఇక్కడ పని చేసిన అలేఖ్య బదిలీపై వేరేచోటకు వెళ్లారు.


కె. కోటపాడులో బండారు జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు


సాయిబాబా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు


మాడుగులలో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

కె. కోటపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన వేడుకలు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం 30 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొ ట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా రొంగలి మహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నియోజకవర్గానికి అందిస్తున్న సేవలను అందరూ సద్వినియో గం చేసుకోవాలని కోరారు. స్థానిక కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు జూరెడ్డి రా ము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు జన్మదినం సందర్భంగా షిర్డీసాయి ఆలయంలో పేదలకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సబ్బవరపు రామునాయుడు, డోకల నరసింహమూర్తి, పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకునాయుడు, పూడి శ్రీను, బండారు నరసింహనాయుడు, బొడ్డు అక్కునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, బండారు దేముడు బాబు, వంటాకు శ్రీను, లెక్కల మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల: స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి జన్మదినోత్సవం పురస్కరించుకుని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పరాజు ఆధ్వర్యంలో ఆయన పేరిట మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పళ్లు , రొట్టెలను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, డిల్లీ నానాజీ, పంచాడ శ్రీను, జొన్నపల్లి రమేశ్ బాబు పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యేను స్వగ్రామంలో నాయకులు అద్దెపల్లి జగ్గారావు, పుప్పాల లక్ష్మీనారాయణ, వద్దాది రంజిత్‌వర్మ, రమేశ్, రొబ్బా మహేశ్, లెక్కల కాశీబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బుచ్చయ్యపేట ఎంపీడీవోకు నివాళి


ఎంపీడీవో విజయలక్ష్మి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమెల్యే రాజు ,నాయకులు

బుచ్చెయ్యపేట జూన్19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎంపీడీవో వి. విజయలక్ష్మి బుధవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో చోడవరం ఎమెల్యే రాజు గురువారం విశాఖపట్నం చేరుకుని ఎంపీడీవో భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట విశాఖ డెయిరీ డెరెక్టర్ గేదల సత్య నారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, తహసీల్దార్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారి రాజగోపాల్ సేవలు భేష్


డిప్యూటీ రేంజి అధికారి రాజగోపాల్ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

చోడవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో డిప్యూటీ రేంజ్ అధికారి రాజగోపాల్ అందరికీ ఆదర్శంగా నిలుస్తారని స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారి పి.వి. రవివర్మ తెలిపారు. విజయగరం జిల్లా అటవీశాఖ డివిజన్‌కు బదిలీపై వెళుతున్న రాజగోపాల్‌ను స్థానిక అటవీ సిబ్బంది బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణాయుతంగా విధులు నిర్వహించిన రాజగోపాల్ లాంటి అధికారులు అటవీశాఖకు అవసరమన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ దంపతులను రేంజ్ అధికారితో పాటు, ఉ ద్యోగులు ఘనంగా సత్కరించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

చోడవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తైక్వాండో జాతీయ స్థాయి క్రీడాకారుడు అర్రెపు శ్రీనివాస్ తెలిపారు. 21న అంతర్జాతీయ యోగాడే సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పోర్ట్సు కోచ్ పల్లం మురళీ కృష్ణ ఆధ్వర్యంలో క్రీడాకారులకు యోగా శిక్షణ నిర్వహించారు.

యోగా డేకి 105 మంది తరలింపు

రోలుగుంట: విశాఖలో ఈ నెల 21న జరిగే యోగా డేకు మండలంలోని 24 పంచాయతీల నుంచి 105 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. రెండు బస్సుల ద్వారా శుక్రవారం మధ్యాహ్నం వీరు బయలుదేరి వెళ్తారన్నారు.

యోగాపై శిక్షణ


చోడవరంలో యోగాసనాలు వేస్తున్న తైక్వాండో విద్యార్థులు

రావికమతం: విశాఖకు వెళ్లేందుకు మండలంలో ఎంపిక చేసిన యువతీ, యువకులకు యోగాసనాలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామానికి ఆరుగిరి చొప్పున ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు,జనసేన పార్టీ అధ్యక్షుడు ఎం.నాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, అధికారులుపాల్గొన్నారు.

రాయిపాడులో ఇద్దరికి మలేరియా



జ్వర బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కొత్తకోట వైద్య సిబ్బంది

రావికమతం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడు గిరిజన గ్రామంలో గురువారం కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. రాయిపాడులో వైరల్ జ్వరాలు అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం మేరకు వైద్యాధికారిణి సురేఖ ఆధ్వర్యంలో గ్రామంలో 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి ఆర్‌డీ టీ టెస్టులు నిర్వహించగా వీరిలో ఇద్దరికి మలేరియా వచ్చినట్టు నిర్ధారణ అయినట్టు వైద్యాధికారి తెలిపారు. మిగిలిన వారికి సాధారణ జ్వరాలుగా గుర్తించి, మందులు అందజేశామని ఆమె తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, హెచ్‌వీ వి.ఎర్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పిఎస్ జోషిని పాల్గొన్నారు.

కిరాణా షాపుల్లో పాఠశాలల కోడిగుడ్లు విక్రయాలు


రోలుగుంటలోని ఓ షాపులో ఎండీఎం మార్కు ఉన్న కోడిగుడ్లు

రోలుగుంట, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు సరఫరా చేసిన కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయి. గురువారం మండల కేంద్రంలోని వినాయక గుడి సమీపంలో గల పలు కిరాణా దుకాణాల్లో పలువురు గుడ్లు కొనుగోలు చేశారు. వాటిపై ప్రభుత్వం ముద్రించిన ఎండీఎం ముద్ర వేసి ఉంది. ఇవి ఇక్కడివి? ఏ పాఠశాల నుంచి వచ్చాయన్నది తెలియాల్సి ఉంది. దీనిపై ఎంఈఓ జాన్ ప్రసాద్‌ను వివరణ కోరగా కిరాణా షాపుల్లో పాఠశాలల కోడిగుడ్లు విక్రయాలపై తమ దృష్టికి రాలేదన్నారు. ఎండీఎం ముద్ర ఉంటే ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసినవే నని దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొరత లేకుండా ఖరీఫ్ విత్తనాలు : ఎమ్మెల్యే రాజు

చోడవరం,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఈ ఏడాది ఖరీఫ్‌కు విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. గురువారం లక్కవరంలో రాయితీపై విత్తనాలు, పవర్‌టిల్లర్లు, స్ప్రేయర్లు పంపిణీని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్, ఏవో పావని, ఏఈవో కిరణ్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ నాయకులు కనిశెట్టి మత్స్యరాజు, నాగులాపల్లి సూర్యనారాయణ, సేనాపతి శ్రీనివాసరావు, వబలరెడ్డి శ్రీను, పాల్గొన్నారు.


బి.కింతాడలో..

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై పది రకాల వరి విత్తనాలు సర్పంచ్ బూరేబాబూరావు గురువారం రైతులకు అందజేశారు. వ్యవసాయ సహాయ అధికారి యశోద, కడిం.నాగేశ్వరరావు, కొమార బాబూరావు పాల్గొన్నారు.

'జగనంటే నమ్మకం'


చీడికాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాలను గురువారం వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పరవాడ మహేశ్ తదితరులు విడుదల చేశారు. నాయకులు కొల్లి శ్రీనివాసరావు, పుట్టా రామ్‌కుమార్, పరవాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



- రోజువారీ సాధనతో అనేక అనారోగ్య సమస్యలకు చెక్
- యోగాను జీవితంలో భాగం చేసుకోవాలంటున్న నిపుణులు
- 21 యోగాసనాలతో ఈ నెల 21న విశాఖలో యోగా





అర్ధ చక్రాసనం

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్య సిద్ధిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అనేక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు. యోగాలో భాగంగా వేసే ఒక్కో ఆసనంతో ఒక్కో హెల్త్ బెనిఫిట్ ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలకూ పరిష్కారం లభిస్తుందంటున్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నగరంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా యోగా గురించే చర్చ. ఈ నేపథ్యంలో యోగా అంటే ఏమిటి.? యోగసనాల వల్ల కలిగే ప్రయోజనాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రోజూ యోగా చేస్తే ఆరోగ్యానికి మేలు. శారీరక సామర్థ్యం పెరుగుతుంది. మానసికంగానూ దృఢంగా ఉంచుతుంది. భావోద్వేగాలను నియంత్రించుకోవడం సులభమవుతుందని నిపుణులు చెబుతున్నారు. మారిన ఆహార అలవాట్లు, జీవనశైలితో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటికి యోగా చక్కని పరిష్కారమంటున్నారు. యోగా సాధనతో ఎన్నో రకాల వ్యాధులను నయం చేసుకునే అవకాశముందని చెబుతున్నారు.

యోగా అంటే..?

యోగా అంటే ఆత్మను తెలుసుకోవడం. ఇది మతానికి, దేవుడికి సంబంధించినది కాదు. ప్రతి ఒక్కరిలో ఉండే జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయడాన్నే యోగాగా అభివర్ణిస్తారు. పతంజలి మహర్షి చెప్పినట్టు యోగా అంటే మనసు, ఇంద్రియాలను ఒకచోట నిలుపుదల చేయడం. దీని ద్వారా ఆత్మానుభూతి లభిస్తుంది. ఇందులో దేవతారాధనకు అవకాశమే లేదు.

21 ఆసనాలతో ప్రొటోకాల్ యోగా..

ఈ నెల 21న నిర్వహించనున్న యోగా డే వేడుకల్లో 21 ఆసనాలతో ప్రొటోకాల్ యోగా చేయనున్నారు. ఇందులో ఎనిమిదేళ్ల చిన్నారి నుంచి 80 ఏళ్ల వృద్ధుడి వరకు ఎవరైనా వేసేందుకు అనువుగా ఆసనాలుంటాయి. వీటితో అనేక ఆరోగ్య లాభాలుంటాయి.

ప్రార్థన: యోగాసనాలు వేయడానికి ముందు ప్రార్థన చేస్తారు. సమష్టిగా ఆలోచిద్దాం. సమష్టిగా నడుచుకుందాం. పూర్వీకులు, దేవతలు, ఇలా చేసే విజయం సాధించారు అని ప్రార్థన అర్థం. అనంతరం యోగసనాలు వేస్తారు. యోగసనాలు వేయడానికి ముందు నెక్ బెండింగ్, షోల్డర్ స్ట్రెచింగ్ అండ్ రొటేషన్, ట్రంక్ ట్విస్టింగ్ (మూవ్‌మెంట్), నీ మూవ్‌మెంట్ చేస్తారు. నెక్ బెండింగ్‌ను శీతలీకరణ వ్యాయామం అంటారు. దీనివల్ల స్పాండిలైటిస్, మెడ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో మూడు రకాల టెక్నిక్స్ ఉంటాయి. అప్ అండ్ డౌన్ మూవ్‌మెంట్, సైడ్ బెండింగ్, నెక్ రొటేషన్ చేస్తారు. షోల్డర్ స్ట్రెచింగ్ అండ్ రొటేషన్ వల్ల భుజాల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ట్రంక్ ట్విస్టింగ్ (మూవ్‌మెంట్) ద్వారా వెన్నెముక ఫ్లెక్సిబిలిటీ కలుగుతుంది. నీ మూవ్‌మెంట్ ద్వారా జాయింట్ పెయిన్స్ నుంచి ఉపశమనంతోపాటు నరాలు శక్తివంతంగా మారేందుకు ఉపకరిస్తాయి. ఆ తరువాత ఆసనాలు ప్రారంభమవుతాయి.

ఇవీ ఆసనాలు..

యోగాలో భాగంగా వేసే 21 ఆసనాలను ప్రొటోకాల్ యోగా అంటారు. ఇందులో వేసే ప్రతి ఆసనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది ఆసనాలు, ప్రయోజనాలు చూద్దాం.

తాడాశానం/వృక్షాసనం: ఈ ఆసనం వేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. నరాల శక్తిని పెంచేందుకు దోహదపడుతుంది.

పాద హస్తాసనం: రక్త ప్రసరణ మెరుగుపడేందుకు ఉపకరిస్తుంది. ఈ ప్రక్రియలో ఇబ్బందులు తొలగుతాయి.

అర్ధ చక్రాసనం: థైరాయిడ్ సమస్యతో బాధపడే వారికి ఉపయోగపడుతుంది. వెన్ను నొప్పి, ఆస్తమా నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది.

త్రికోణాసనం: వెన్నెముక ఫ్లెక్సిబిలిటీకి ఉపయోగపడుతుంది. శరీరంలో అధికంగా ఉన్న కొవ్వును కరిగించడంలో ఉపకరిస్తుంది. అధిక బరువు, ఒబేసిటీ వంటి సమస్యలతో బాధపడే వారు నిపుణుల పర్యవేక్షణ లో ఈ ఆసనాన్ని వేస్తే మంచి ఫలితాన్ని పొందవచ్చు.

దండాసనం: కూర్చునే స్థితి సరిగా లేకపోతే అనేక వెన్ను సమస్యలు ఎదురవుతాయి. ఈ సమస్యలను నయం చేయడంలో ఈ ఆసనం ఉపయోగపడుతుంది.

భద్రాసనం/వజ్రాసనం: జీవక్రియ సాఫీగా జరిగేందుకు ఉపకరిస్తుంది. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు వల్ల వస్తున్న జీర్ణ సంబంధిత సమస్యలను నియంత్రించడంలో ఈ ఆసనం కీలకంగా పనిచేస్తుంది.

అర్ధ ఉష్ట్రాసనం, ఉష్ట్రాసనం: ఈ రెండు ఆసనాలు ఊపిరితిత్తులు, ఆస్తమా సమస్యలతో బాధపడేవారికి మేలు చేస్తాయి. బ్రాంకైటిస్‌తో బాధపడే వారికి పరిష్కారం లభిస్తుంది.



వజ్రాసనం



శేతు బంధాసనం



అర్ధ ఉష్ట్రాసనం

శశాంకాసనం: జీర్ణక్రియను మెరుగుపర్చేందుకు, వెన్నెముకను సాగదీసేందుకు, మలబద్ధకం సమస్యను తొలగించేందుకు ఈ ఆసనం ఉపకరిస్తుంది.

ఉద్దాన మండూక ఆసనం: ప్రాణ వాయువును అధికంగా తీసుకునేందుకు, ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు, భుజాలకు, మెడ కండరాలను శక్తివంతం చేసేందుకు వెన్నెముక, మెడ కండరాలను శక్తివంతం చేసేందుకు ఈ ఆసనాలు ఉపయోగపడతాయి.

వక్రాసనం: మధుమేహం సమస్యతో బాధపడే వారికి ఈ ఆసనం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సమస్యనుంచి బయటపడేస్తుంది.

మకరాసనం: ఒత్తిడి తొలగించేందుకు ఉపకరిస్తుంది. ఉద్యోగ, వ్యాపార ఒత్తిళ్లతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు మంచి ఫలితాన్ని పొందవచ్చు.

భుజంగాసనం/శలభాసనం/శేతు బంధాసనం: ఈ మూడు ఆసనాల ద్వారా దీర్ఘకాలిక నడుమునొప్పి, వెన్నెముక సమస్యలు, సయాటికా నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఉద్దాన పాద ఆసనం/అర్ధ హల ఆసనం: గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు తగ్గించేందుకు దోహదపడతాయి.

పవన ముక్తాసనం: గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి బయట పడేందుకు ఉపకరిస్తుంది.

శవాసనం: ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడంతో పాటు బీపీ సమస్యను పూర్తిగా తగ్గించడంలో కీలకంగా పనిచేస్తుంది.


యోగాసనాలతో ఎంతో మేలు..

యోగసనాలతో అంగ సౌష్టవం ఏర్పడుతుంది, శరీరంలో అన్ని భాగాలకు రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది, నాడుల స్థితి, స్థాపక శక్తి పెరుగుతుంది. షట్ చక్రాలు ఉత్తేజితమవుతాయి, ఏకాగ్రత, ధైర్యం, గ్రహణ శక్తి పెరుగుతుంది. చిత్త చాంచల్యం, భయం, అలసత్వం నశిస్తాయి. ఆధ్యాత్మిక చింతన, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. నిశ్చలత్వం, ఆత్మానుభూతి, ధారణ శక్తి, సమాధిస్థితి సిద్ధిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఈ వ్యాధులకు చెక్..

దేహం, దేశం, వృత్తి, రుతువుల మార్పుల వల్ల వచ్చే అనేక సమస్యలను యోగాతో నయం చేయవచ్చు. విద్యార్థుల ఏకాగ్రతకు, ఒత్తిడిని తగ్గించేందుకు ఆసనాలు ఉపయోగపడతాయి. చదువులో ఏకగ్రత సాధించేందుకు తాటక క్రియ, సూత్ర నీతి ఉపకరిస్తాయి. ఈ రెండు క్రియలు సాధన చేయాలి. అనులోమ, వినులోమ ప్రాణాయామాలు చేయాలి.

శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం



ప్రతిరోజూ యోగా చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. శరీరానికి, మనస్సుకు సాంత్వన లభిస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను కొన్ని యోగసనాల ద్వారా నయం చేసుకోవచ్చు. ఇంద్రియ నియంత్రణ సాధ్యపడుతుంది. నెగిటివ్ ఎనర్జీ తగ్గుతుంది. ప్రొటోకాల్ యోగసనాలతో దీర్ఘకాలం వేధించే అనేక ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుంది. చిన్నారుల నుంచి వృద్ధులు వరకు ప్రతి ఒక్కరూ యోగాను సాధన చేయవచ్చు. కొన్నిరోజులు అలవాటు చేసుకుంటే మరింత ఇష్టపడతారు. యోగాకు ముందు, తరువాత అన్నట్టుగా మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి. విద్యార్థులకు యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది. ఒత్తిడికి దూరమై చదువులో రాణించే వీలుంటుంది. ఈ నెల 21న విశాఖలో నిర్వహించే యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

- పైడం నాయుడు,
యోగ భారతి ట్రస్ట్ వ్యవస్థాపకులు

యోగా దినోత్సవంలో యుద్ధ విమానాల ప్రదర్శన

... 3వ పేజీ తరువాయి

ముగిస్తారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం 7.01 గంటలకు యోగాసనాలు ప్రారంభించి 7.45 గంటల వరకు కొనసాగిస్తారు. ప్రతి ఆసనం ఒక నిమిషం పాటే ఉంటుంది. ఆ తరువాత యోగా పోటీలు విజేతలైన వారిని అభినందిస్తారు. 7.55 గంటలకు వేదిక నుంచి ప్రధాని బయలుదేరి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానానికి వెళతారు. అక్కడకు ఎనిమిది గంటలకు వెళ్లి పది నిమిషాలు పాటు గిరిజన విద్యార్థులు చేసే సూర్య నమస్కారాలు తిలకిస్తారు. అక్కడి నుంచి 8.15 గంటలకు బయలుదేరి నేవీ గెస్ట్ హౌస్‌కు వెళ్లిపోతారు. సీఎం చంద్రబాబునాయుడు కలెక్టరేట్‌లో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోర్టు గెస్ట్‌హౌస్‌లో, ఐటీ మంత్రి లోకేశ్ పార్టీ ఆఫీసులో, గవర్నర్ నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు.

ఐదు లక్షల మందికి స్నాక్స్



విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖలో శనివారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే ఐదు లక్షలమందికి స్నాక్స్ పంపిణీ చేయనున్నారు. యోగాసనాలు పూర్తి చేసి, తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరికి స్నాక్స్‌తో కూడిన ప్యాకెట్ అందజేస్తారు. ఇందులో వాటర్‌బాటిల్, రెండు టాటాగ్లూకోజ్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్, కేక్, అరటిపండు, బత్తాయి ఉంటాయి. ఆర్కేబీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేసేవారికి వీటిని పంపిణీ చేసేందుకు 26 జిల్లాలకు చెందిన డీఎస్‌వోలు, సుమారు పదివేల మంది సిబ్బందిని నియమించారు. వారికి జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి పాసులు జారీచేశారు. వీరికి సహాయపడేందుకు నగరంలోని 600 మంది డీలర్లను నియమించారు. స్నాక్స్ పంపిణీపై గురువారం విశాఖ, శ్రీకాకుళం డీఎస్వోలు వి.భాస్కర్, ఎస్.సూర్యప్రకాష్‌లు సమీక్షించారు.

పేదింట సాహితీ కెరటం

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీయడిట్ పూర్తిచేశాడు. ఇక చదివించే స్థోమత తమకు లేదని తల్లిదండ్రులు చెప్పేశారు. అయితే ప్రసాద్ తన భవిష్యత్తును వెతుక్కుంటూ హైదరాబాద్ చేరుకున్నాడు. అక్కడ సంవత్సరం పాటు బార్‌లో పనిచేశాడు. ఆ సంపాదనతో 2019లో హైదరాబాద్‌లో గల జేఎన్‌టీయూలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేరి 2024లో పూర్తిచేశాడు. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రం బరోడాలో మహారాజా సాయాజీరావు యూనివర్సిటీలో ఎంఏ ఆర్కియాలజీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు.

మత్స్యకారుల చరిత్రకు అద్దం పట్టే 'మైరావణ'

చిన్నతనంలో వాడనర్సాపురం గ్రామంలో వరుసకు బాబాయి అయిన సూరాడ గోవింద ఫైన్ ఆర్ట్స్‌లో, సినీ గాయకుడిగా మంచి పేరు సాధించడంతో తాను కూడా అలా సెలబ్రిటీగా మారాలనే ప్రసాద్‌కు ఉండేది. హైస్కూల్ నుంచి పుస్తకాలు చదవడంలో పాటుగా ఆర్ట్‌లు వేయడం, నటించడం, మిమిక్రీ చేయడం వంటివి చేసేవాడు. ఆ సమయంలో ఏదో ఒక కథను రాస్తూ తోటి విద్యార్థులకు వినిపించే వాడు. హైదరాబాద్‌లో బార్‌లో పనిచేసే సమయంలో రచనలు చేయడం మొదలుపెట్టాడు. ప్రసాద్ సూరి కలం పేరిట రచనలు చేశాడు. తొలిగా మై నేమ్ ఈజ్ చిరంజీవి అనే నవల రాశాడు. చాయా పబ్లికేషన్ ద్వారా విడుదల చేసిన ఈ నవల అందరికీ నచ్చడంతో అదే ఉత్సాహంతో మైరావణ నవలను రాశాడు. స్వగ్రామంలో పెద్దలు చెప్పిన పూర్వీకుల చరిత్రను కథగా మలిచాడు. మత్స్యకార కుటుంబ జీవన విధానంతో పాటు తమ వాడబలిజ కుటుంబాలు ఎలా ఆవిర్భవించాయి అనే విషయాన్ని కథగా, ఫిక్షనల్ క్యారక్టర్‌లను చూపించి పాఠకులను కట్టి పడేశాడు. తమ పూర్వీకులు బర్మా, రంగూన్‌లో బతికారని, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మించే సమయంలో కూలీలుగా వలస వచ్చారని, మొట్టమొదటిసారిగా మైలపిల్లి మైరావుడు వల తయారు చేశాడని, అప్పటి నుంచి తాము చేపలు పట్టడం ప్రారంభించామని తెలుసుకున్న ప్రసాద్ అదే కథను కల్పిత పాత్రలతో మైరావణ నవల రాశాడు.

ప్రభుత్వ బడులు వెలవెల!

... 3వ పేజీ తరువాయి

పాఠశాలలో నలుగురు విద్యార్థులు, దుంగలవానిపాలెం పాఠశాలలో నలుగురు విద్యార్థులు, చంద్రయ్యపాలెం పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు, జి.గంగవరం పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు, ఎన్‌జీఆర్ పేట అగ్రహారం పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు, తామరం-1 పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు, తామరం-2 పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు వున్నారు. ఈ పాఠశాలల్లో ఒక్కొక్కరు చొప్పున ఉపాధ్యాయులు వున్నారు. మరికొన్ని పాఠశాల్లో పది కన్నా తక్కువ మంది విద్యార్థులు వున్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు కూడా ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఇంచుమించుగా ఇదే విధంగా వుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి సారించారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ సాయం అందిస్తామని ప్రకటించారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడంపై మండల విద్యా శాఖ అధికారులు తగిన శ్రద్ధ చూపలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మామిడిపాలెం స్కూల్లో ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పరవాడపాలెంలో గెడ్డవాగు కబ్జా

... 3వ పేజీ తరువాయి

స్థలం విలువ రూ.2 కోట్లకుపైగానే వుంటుంది. కాగా సర్వే నంబరు 63/9లో గెడ్డవాగు స్థలం కబ్జాపై తహశీల్దార్ సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఉగ్గినపాలెం వీఆర్‌వోను అక్కడకు పంపించి, రికార్డులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తానని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయితే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

విశాఖకు 60 వేల మంది

... 3వ పేజీ తరువాయి

ట్యాగింగ్ విధానంలో నమోదు చేస్తున్నారు.

రూట్లు.. మండలాలు..

రూట్ నంబర్-1: అనకాపల్లి, వి.మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, చోడవరం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం, సబ్బవరం మండలాలకు చెందిన బస్సులు చిన్నయ్యపాలెం జంక్షన్, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శొంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతువాక, ఎండాడ లా కాలేజీ రోడ్డు, ఐటీ సెజ్ మార్గంలో బీచ్ రోడ్డుకు వెళ్లాల్సి ఉంటుంది.

రూట్ నంబర్-2: పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, కశింకోట, మునగపాక, కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన బస్సులు ఆయా రూట్లలో జాతీయ రహదారిపై తాళ్లపాలెం, కశింకోట మీదుగా ప్రయాణించి అనకాపల్లి బైపాస్, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శొంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతువాక జంక్షన్, ఎండాడ లా కళాశాల రోడ్డు, ఐటీ సెజ్ మీదుగా బీచ్ రోడ్డులో కేటాయించిన ప్రదేశాలకు వెళ్లాల్సి ఉంటుంది.

రూట్ నంబర్-3: రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని ఫార్మా కంపెనీలు, పరిశ్రమల కార్మికులు, ఉద్యోగులు, ఆయా మండలాలకు చెందిన విద్యార్థుల బస్సులు లంకెలపాలెం, గాజువాక, ఎన్ఏడీ, గోపాలపట్నం, సింహాచలం, అడవివరం, హనుమంతువాక జంక్షన్, ఎండాడ లా కళాశాల రోడ్డు, ఐటీ సెజ్ మీదుగా బీచ్ రోడ్డులో కేటాయించిన ప్రదేశాలకు వెళ్లాల్సి ఉంటుంది.

నేడు సీఎం చంద్రబాబు రాక

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి 4.45 గంటలకు బయలుదేరి 5.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ నుంచి ఆరుగంటలకు ఐఎన్ఎస్ డేగాకు వెళతారు. యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సాయంత్రం 6.45 గంటలకు స్వాగతం పలుకుతారు. అనంతరం ఏడు గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి తూర్పు నౌకాదళానికి చెందిన ఆఫీసర్స్ మెస్‌కు వెళ్లి రాత్రి 7.30 గంటల వరకూ ఉంటారు. అనంతరం బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుని, అక్కడ బస్సులో బస చేస్తారు. శనివారం ఉదయం 6.10 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకుని, గవర్నర్, ప్రధానమంత్రికి స్వాగతం పలుకుతారు. 6.30 గంటల నుంచి 7.50 గంటల వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని, 11.20 గంటల వరకూ బస్సులోనే ఉంటారు. తరువాత ఐఎన్ఎస్ డేగాకు వెళ్లి ప్రధానికి వీడ్కోలు పలుకుతారు. అక్కడ నుంచి తిరిగి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 12.40 గంటలకు హైదరాబాద్ వెళతారు.

గిన్నిస్ రికార్డుపై గురి

... 3వ పేజీ తరువాయి

కార్యక్రమం రద్దు చేసి మొత్తం కార్యక్రమం ఇదే వేదిక వద్ద నిర్వహిస్తారు. వాతావరణం అనుకూలంగా ఉంటే...బీచ్ రోడ్డులో గిన్నిస్ రికార్డు పూర్తయిన తరువాత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడులు ఏయూకు వచ్చి విద్యార్థుల సూర్య నమస్కారాలను పది నిమిషాల పాటు పరిశీలిస్తారు. కాగా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి వెళ్లి ఏర్పాట్లు పరిశీలిస్తారు. గిరిజన విద్యార్థులను ఏజెన్సీలోని 106 పాఠశాలల నుంచి 495 బస్సుల్లో విశాఖపట్నం తీసుకువస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569